కృష్ణా యూనివర్సిటీలో పీహెచ్‌డీల ప్రదానం ప్రహసనంగా మారింది. లక్షల రూపాయలు ఫీజులు చెల్లించి, పీహెచ్‌డీ పూర్తి చేసి, పరిశోధనా పత్రాలు సమర్పించిన అభ్యర్థులు పట్టాల కోసం ఏళ్ల తరబడి వర్సిటీ చుట్టూ తిరుగుతున్నారు. 57 మంది స్కాలర్‌లు సమర్పించిన పత్రాలు కనిపించకుండా పోవడం ఇక్కడి అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. దీనిపై ఉన్నత విద్యా మండలి అధికారులు, గవర్నర్‌కు ఫిర్యాదు చేసినా వీరిలో చలనం ఉండటంలేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

పీహెచ్‌డీలా!

కృష్ణా యూనివర్సిటీలో 200 మందికిపైగా స్కాలర్‌లు

పరిశోధనా పత్రాలు సమర్పించిన 57 మంది ఫైల్స్ మాయం

- 2012 నుంచి పెండింగ్‌లోనే పీహెచ్‌డీల ప్రదానం
- కావాలనే జాప్యం చేస్తున్నారని అధికారులపై విమర్శలు



కృష్ణా యూనివర్సిటీ

(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం): కృష్ణా యూనివర్సిటీలో కెమిస్ట్రీ, ఫార్మసీ, కామర్స్, ఇంగ్లీష్, బిజినెస్ మేనేజ్‌మెంట్, బయో టెక్నాలజీ తదితర విభాగాల్లో 200 మందికి పైగా రీసెర్చ్ స్కాలర్‌లు ఉన్నారు. రెగ్యులర్‌గా అయితే మూడు సంవత్సరాల్లో, పార్ట్‌టైమ్ పద్ధతిలో అయితే నాలుగేళ్లలో పీహెచ్‌డీని పూర్తి చేయాలి. తొలుత పీహెచ్‌డీ చేసేందుకు ముందుకు వచ్చిన స్కాలర్‌లకు ఆరు నెలల్లో పరీక్ష నిర్వహించి, వారు ఏ అంశంపై రీసెర్చ్ చేస్తున్నారో చూసుకుని అనుమతులు ఇవ్వాలి. ప్రతి ఏడాది జనవరి, జూన్ నెలల్లో ఒకసారి రీసెర్చ్ రెన్యువల్ కమిటీ సభ్యులు స్కాలర్‌లు చేస్తున్న పరిశోధనల తీరును పరిశీలించి వారికి తగు సూచనలు చేయాలి. యూనివర్సిటీలో రీసెర్చ్ విభాగంలో డైరెక్టర్‌లు రెగ్యులర్‌గా లేకపోవడం, వచ్చిన వారు మొక్కుబడిగా పనిచేయడంతో పీహెచ్‌డీల ప్రదానంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. 2012లో యూనివర్సిటీలో పీహెచ్‌డీ పరిశోధనలు ప్రారంభం కాగా, 2012, 2014, 2018 సంవత్సరాల్లో పరిశోధనలు ప్రారంభించి పూర్తిస్థాయిలో తమ పత్రాలను సమర్పించిన వారికి నేటికీ పీహెచ్‌డీ పట్టాలు అందజేయక పోవడం గమనార్హం. సైన్స్ సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ చేసే వారు అధికశాతం మంది స్కాలర్‌లు ఉండగా, యూనివర్సిటీలో ఇంతవరకు సైన్స్ సబ్జెక్టులు బోధించే ప్రొఫెసర్‌లు, రీసెర్చ్ విభాగం డైరెక్టర్‌గా ఒక్కరు కూడా ఇంతవరకు పనిచేయక పోవడం విశేషం. గతంలో వివిధ అంశాలపై పరిశోధనలు చేసి పత్రాలు సమర్పించిన 57 మందికి సంబంధించిన పత్రాలు కనిపించకుండా పోయినట్టు మిగతా 6లో..

యూనివర్సిటీ నగదు ప్రైవేటు బ్యాంకులకు..

ఇటీవల కాలంలో యూనివర్సిటీకి చెందిన నగదును రెండు ప్రైవేటు బ్యాంకుల్లోకి మార్చిన అంశంపై అధికారుల్లో చర్చ నడుస్తోంది. యూనివర్సిటీలో ఎస్‌బీఐ బ్రాంచ్ ఉంది. ఇప్పటివరకు అందులోనే యూనివర్సిటీకి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలను నడుపుతూ వచ్చారు. ఇటీవల కాలంలో ఎస్‌బీఐ బ్రాంచ్‌లోని మూడు కోట్ల రూపాయలను మచిలీపట్నంలోని రెండు ప్రైవేటు బ్యాంకుల్లోకి మార్చిన విషయం వెలుగులోకి వచ్చింది. ఇది ఎవరి ప్రమేయంతో జరిగింది, పాత్రదారులు, సూత్రదారులు ఎవరు, ఇందుకు గల కారణాలు ఏమై ఉంటాయనే అంశంపై అనేక అనుమానాలను యూనివర్సిటీలో పనిచేసే ప్రొఫెసర్‌లు, సిబ్బంది వ్యక్తం చేస్తున్నారు. ఎస్‌బీఐ అధికారులు యూనివర్సిటీలో ఎస్‌బీఐ బ్రాంచ్ ఏర్పాటు చేయడం లాభదాయకంగా లేదని, వేరే ప్రాంతానికి ఈ బ్రాంచ్‌ను మార్చాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు లేఖ కూడా రాసినట్లు సమాచారం.

చెల్లించిన ఫీజులు రూ.15 కోట్లు పైనే..

యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేసేందుకు అనుమతులు ఇచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు స్కాలర్‌లు కట్టిన ఫీజులు రూ.15 కోట్లపైనే ఉంటాయని వర్సిటీ అధికారులే చెబుతున్నారు. ఇంత పెద్దమొత్తంలో ఫీజులు వసూలు చేసినా పీహెచ్‌డీ పట్టాలు ఇవ్వకుండా స్కాలర్‌లను యూనివర్సిటీ చుట్టూ తిప్పుకుంటున్నారని పలువురు విమర్శిస్తున్నారు.



షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానం

పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చూపిన జిల్లాలోని విద్యార్థులను సోమవారం మచిలీపట్నంలో షైనింగ్ స్టార్స్ అవార్డులతో కలెక్టర్ బాలాజీ సత్కరించారు. ఒక్కో విద్యార్థికి రూ.20 వేల నగదు ప్రోత్సాహం అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఈవో రామారావు, ఇంటర్మీడియట్ అధికారి సాల్మన్ రాజు, ఎస్పీ గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు. 8లో



జగన్ పత్రిక ప్రతుల దహనం

రాజధాని అమరావతి మహిళలను కించపరుస్తూ మాట్లాడిన జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావు, జగన్ మీడియాపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ శ్రేణులు జిల్లా వ్యాప్తంగా సోమవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. గుడివాడలో జగన్ పత్రిక ప్రతులను టీడీపీ నాయకులు దహనం చేశారు. 6లో

కూల్చివేతకు అనుమతి లేదు

శాతవాహన కరస్పాండెంట్ రమాసత్యనారాయణ

విజయవాడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : శాతవాహన కళాశాల భవనాలను కూల్చడానికి లిఖితపూర్వకంగా కానీ, మౌఖికంగా కానీ ఎలాంటి అనుమతి ఇవ్వలేదని ఆ కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాను కరస్పాండెంట్ మాత్రమేనని, ఒక అనుమతి ఇచ్చినా అది పనిచేయదని పేర్కొన్నారు. బోయపాటి శ్రీనివాస అప్పారావుకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా.. దాన్ని తీసుకొచ్చి పెద్ద మనుషులు, పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులు పంచనామా చేసి ఆస్తిని అప్పగించాలని తెలిపారు. భవనాలు కూల్చడానికి మున్సిపల్ కమిషనర్, పోలీస్ శాఖ అనుమతి కావాలని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ఏదీ శాతవాహన విషయంలో జరగలేదని ఆయన మండిపడ్డారు. అర్ధరాత్రి దుండగులు కాలేజీని నేలమట్టం చేయడాన్ని ఖండించారు. పురాతన చరిత్ర ఉన్న గ్రంథాలయాన్ని శిథిలాలుగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. శాతవాహన కాలేజీకి వేరే శాఖ లేదని, కాలేజీ ఇక్కడే నడుస్తోందని పేర్కొన్నారు. ఇంతటి అతిపెద్ద పురాతనమైన కాలేజీని సుప్రీంకోర్టు ఉత్తర్వుల ద్వారా స్వాధీనం చేసుకునేటప్పుడు పత్రికల్లో బహిరంగ ప్రకటన ఇవ్వాలని, దీన్ని బోయపాటి పాటించలేదని ఆయన పేర్కొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల నేతల దీక్షలు

- సెకండరీ గ్రేడు టీచర్లకు మాన్యువల్‌గా బదిలీల కౌన్సెలింగ్‌కు డిమాండ్ 8



మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్షల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

చెత్తశుద్ధి కావాలి

వర్మీ కంపోస్టు ప్లాంట్లు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నగరంలో ఓ వెలుగు వెలిగిన ఈ ప్లాంట్లు ఇప్పుడు మచ్చుకు కూడా కనిపించట్లేదు. సేంద్రియ వ్యర్థాల నుంచి వర్మీ కంపోస్టును తయారుచేసే ఈ ప్లాంట్లు అప్పట్లో విజయవంతం కాగా, కాలక్రమంలో మూతపడ్డాయి. ప్రస్తుతం నగరంలో 300 టన్నుల వరకు సేంద్రియ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్న నేపథ్యంలో తిరిగి వర్మీ ప్లాంట్లు ఏర్పాటుచేస్తే బాగుంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బెజవాడలో వర్మీ కంపోస్టు ప్లాంట్ల ఏర్పాటు అవసరం

- రోజూ 300 టన్నుల మేర సేంద్రియ వ్యర్థాల ఉత్పత్తి
- సద్వినియోగం చేసుకోలేకపోతున్న అధికార యంత్రాంగం
- ఉమ్మడి రాష్ట్రంలో ఉండగా 30 వర్మీ ప్లాంట్లు
- నాడు ప్రపంచ బ్యాంకు గుర్తింపు.. జాతీయస్థాయిలో మూడోస్థానం
- నేడు కనిపించకుండా పోయిన వర్మీ ప్లాంట్లు
- మళ్లీ ఏర్పాటుచేస్తే ఎంతో ఉపయుక్తం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలో రోజుకు 750 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుండగా, ఇందులో 300 టన్నుల సేంద్రియ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. అయితే, వీటిలో పొడిచెత్తను జిందాల్ కంపెనీకి పంపించి సద్వినియోగం చేసుకుంటుండగా, ప్లాస్టిక్ వంటి వ్యర్థాలను ఫైర్ ఉడ్ కేటగిరీ కింద అమ్మి ఆదాయాన్ని సాధిస్తున్నారు. కానీ, సేంద్రియ వ్యర్థాల విషయంలో మాత్రం అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారు. ఈ వ్యర్థాల ద్వారా కూడా సంపద సృష్టించుకునే అవకాశాలున్నా కార్యరూపంలోకి తీసుకొచ్చేలా నిర్ణయాలు ఉండట్లేదు.

దేశంలోనే మూడోస్థానం

అప్పట్లో శ్రీరామ్ ఎనర్జీ ప్లాంట్ ద్వారా చెత్త నుంచి విద్యుత్ తయారుచేసే ప్రాజెక్టును కార్పొరేషన్ చేపట్టింది. మాంసం వ్యర్థాల నుంచి గ్యాస్ తయారు చేసి, దానిద్వారా విద్యుత్‌ను తయారుచేసే బయోమెథనైజేషన్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేసింది. చెత్త నుంచి కంపోస్టు, పిల్లెట్లు తయారుచేసే యూనిట్లను ఏర్పాటు చేసింది. కాలక్రమంలో ఇవన్నీ మూతపడ్డాయి. ఇవి మూతపడిన క్రమంలో వచ్చిన వర్మీ కంపోస్టు ప్లాంట్లు చాలావరకు సమర్థవంతంగా పనిచేశాయి. దీంతో జాతీయ స్థాయిలో విజయవాడ మూడో స్థానాన్ని సాధించింది. స్వచ్ఛతలో విజయవాడకు దక్కిన గౌరవమిది.

వర్మీ కంపోస్టు ప్లాంట్లు అవసరం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉండగా, నగరంలో సేంద్రియ వ్యర్థాల సద్వినియోగంతో పాటు సంపద సృష్టించేలా వర్మీ కంపోస్టు ప్లాంట్లను పెద్ద ఎత్తున ప్రోత్సహించారు. నగరంలో 30 వరకు ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో ప్లాంట్ ద్వారా నెలకు 3 నుంచి 4 టన్నుల వర్మీ కంపోస్టు ఉత్పత్తి జరిగేది. అప్పట్లో వర్మీ కంపోస్టు టన్ను రూ.4 వేలు పలికితే, ఇప్పుడు రూ.10 వేలకు చేరింది. ప్రస్తుతం నగరంలో ఉత్పత్తి అయ్యే 300 టన్నుల సేంద్రియ మిగతా 6లో..

కాలువల నిర్వహణపై కలవరం

రుతుపవనాల రాకతో సాగుకు సిద్ధమవుతున్న రైతులు



గుర్రపుడెక్కతో నిండిన ఏలూరు కాలువ

- గుర్రపుడెక్క తూడుతో నిండిన పంట కాలువలు, డ్రెయిన్లు
- జూన్ వచ్చినా పనులు చేపట్టని అధికారులు
- ఆందోళనలో అన్నదాతలు



వరి నారుమడి కోసం పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు



తూడు, గుర్రపు డెక్కతో అధ్వానంగా పెరికీడు-1 డ్రెయిన్

(ఆంధ్రజ్యోతి- హనుమాన్‌జంక్షన్‌రూరల్): ఏలూరు కాలువ ద్వారా జిల్లాలోని లక్షలాది ఎకరాల్లో వరి పండిస్తున్నారు. సాగునీటికి ప్రధాన ఆధారమైన ఈ కాలువకు అనుసంధానంగా బాపులపాడు మండలంలో పెరికీడు-1 డ్రెయిన్, కాకులపాడు చానల్, వీరవల్లి చానల్ ఉంది. ఇవి గుర్రపు డెక్కతో నిండిపోవడంతో కొన్ని చోట్ల రైతులే స్వయంగా కాలువ పూడికతీత పనులు చేసుకున్నారు. కానీ ప్రధాన కాలువ అయిన ఏలూరు కాలువలో మాత్రం గుర్రపు డెక్క తొలగించలేదు. దీని వల్ల నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడటంతో పాటు బాగు చేసుకున్న కాలువల్లోకి ఈ గుర్రపు డెక్క వచ్చి చేరుతూ మరింత ఇబ్బందికరంగా తయారవుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఖరీఫ్ సీజన్ చివర్లో కురిసిన భారీ వర్షాలకు నీటి పారుదల లేక రోజుల తరబడి పంటలు నీటిలో మునిగిపోయాయి.

అడిగినా సమాధానం లేదు

గత సీజన్‌లో వచ్చిన భారీ వర్షాలు, బుడమేరు ముంపుతో వేలాది ఎకరాలు, గ్రామాలు ముంపులో రోజులతరబడి ఉండి పోయాయి. పెద్దకాలువకు మిగతా 6లో..

పొంచి ఉన్న ముంపు ముప్పు!

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఏలూరు కాలువ లాంటి ప్రధాన కాలువల నిర్వహణ పనులు చేపట్టేందుకు అంచనాలు సిద్ధం చేశారు. తాగునీటి కోసం నీటిని విడుదల చేయడం, తదుపరి వర్షాల కారణంగా తాత్కాలికంగా ఆపివేశారు. నీటి విడుదల నిలిపివేసినా ప్రధాన కాలువల నిర్వహణపై అధికారులు దృష్టి పెట్టలేదు. 923 పైగా పనుల కోసం రూ.66 కోట్లతో అంచనాలు పంపించామని, ప్రభుత్వం ఆమోదం కోసం ఎదురు చూస్తున్నామని ఓ అధికారి తెలిపారు. ఈలోగా రుతుపవనాల ముందస్తు రాకతో రైతులు నారుమడులు పోసుకునేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. జూన్ వచ్చినా నిర్వహణ పనులు చేయకపోవడంతో ఈ సీజన్‌కు కూడా సాగునీటి కాలువల నిర్వహణ లేనట్లేనంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలను బాగు చేయాలని రైతులు కోరుతున్నారు.

గుంటుపల్లిలో గుట్టుగా..

కృష్ణానది తీరాన, పచ్చటి పొదల్లో కోడిపందేలు

ఖరీదైన కార్లలో వచ్చి మరీ భారీగా పందేలు

పక్కా సమాచారంతో పోలీసుల దాడి

కృష్ణాతీరంలో, ఇసుక తిన్నెల్లో, పచ్చగా ఏపుగా ఎదిగిన పొదల్లో పందెపురాయుళ్లు 'బరి' తెగించారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుంటుపల్లిలో గుట్టుచప్పుడు కాకుండా కోడి పందేలు వేశారు. ఖరీదైన కార్లలో దర్జాగా జరిగిన ఈ పందెపు శిబిరాలపై ఆదివారం దాడిచేసిన పోలీసులు పెద్దవారిని వదిలి, పనివారిని పట్టుకోవడం వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- ప్రముఖులను వదిలేసి, పనివారిపై పెట్టీ కేసులు
- ఇబ్రహీంపట్నం పోలీసుల తీరుపై అనుమానాలు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సాధారణంగా సంక్రాంతి సంబరాల్లో కోడిపందేలు జోరుగా సాగుతాయి. కానీ, ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుంటుపల్లిలో మాత్రం సంబరాలతో సంబంధం లేకుండానే కోళ్లకు కత్తులు కడుతున్నారు. వైసీపీ హయాంలో గుంటుపల్లిలో ఇసుక ర్యాంపు నిర్వహించిన ప్రాంతం ఇప్పుడు ఖాళీగా ఉంది. ప్రధాన రహదారి నుంచి రెండు కిలోమీటర్లు వెళ్లిన తర్వాత ఇక్కడ ఓ చిన్న రహదారి వస్తుంది. ఇది పుంతమార్గంలా ఉంటుంది. ఇసుక ర్యాంపు నిర్వహించడానికి ఆ ప్రదేశాన్ని మొత్తం చదును చేశారు. ఈ ప్రదేశాన్ని పందెపురాయుళ్లు కోడిపందేలు వేసుకోవడానికి ఎంపిక చేసుకున్నారు. ఆదివారం ఇక్కడ విచ్చలవిడిగా పందేలు జరిగాయి. ఇందుకోసం హైటెక్ ఏర్పాట్లు కూడా చేశారు. నీడ కోసం టెంట్లు వేశారు. కోడిపుంజులు ఎగిరినప్పుడు, కాలు రువ్వినప్పుడు మట్టి పైకి లేవకుండా గ్రీన్‌కార్పెట్ పరిచారు. చల్లదనం కోసం కూలర్లు ఏర్పాటు మిగతా 6లో..

6 దుర్గమ్మ ఆలయ భద్రతను పరిరక్షించండి
● దుర్గగుడి ఈవో శీనానాయక్

విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు
● కానూరు సెక్షన్‌లో 120 కేసులు నమోదు

8 ఉత్సాహంగా సౌత్‌జోన్ మహిళల క్రికెట్
● ఐదు జిల్లాల క్రీడాకారిణుల హాజరు



ఘాట్ రోడ్డులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న దుర్గగుడి ఈవో శీనానాయక్, ఇంజనీరింగ్ అధికారులు

ఆలయ భద్రతను పరిరక్షించండి

» దుర్గగుడి ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రెండో అతి పెద్దదైన దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం భద్రత, భక్తులకు ఇబ్బంది కలిగించే చర్యలను అన్ని స్థాయిల సిబ్బంది అరికట్టాలని ఈవో వీకే శీనానాయక్ కోరారు. సోమవారం ఘాట్ రోడ్డులో పార్కింగ్ స్థలం, పొంగలి తయారీ షెడ్, బస్ షెల్టర్, ప్రొటోకాల్ ఆఫీసులను ఆయన పరిశీలించారు. ఆ సమయంలో కొన్ని వాహనాలు ప్రొటోకాల్ ఆఫీస్ వరకు రావడం, ద్విచక్ర వాహనాలు ఎక్కడికక్కడ పార్క్ చేసి ఉండటం గమనించారు. ఎటువంటి భద్రతా తనిఖీలు లేకుండా ప్రధాన ఆలయానికి సమీపానికి వాహనాలు అనుమతించడం అంటే ఆలయ భద్రతను పణంగా పెట్టడమే అని అన్నారు. సమీపం వరకు వాహనాలు పంపమని తీవ్ర ఒత్తిడి ఉంటుందని, ట్రాఫిక్ సమస్యలతో తరచూ వివాదాలు జరుగుతున్నాయని ప్రొటోకాల్, సెక్యూరిటీ సిబ్బంది పేర్కొన్నారు. ఓం మలుపు తరువాత పొంగలి షెడ్ దాటి వాహనాలను అనుమతించవద్దని, ప్రొటోకాల్ పరిధిలోకి వచ్చేవారిని ఆఫీస్ వరకు తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అశోక్‌కుమార్, రవీంద్రలను ఈవో ఆదేశించారు.

దుర్గగుడి గిరి ప్రదక్షిణ రేపు

ఇంద్రకీలాద్రి: ప్రతి పౌర్ణమినాడు జరిగే గిరిప్రదక్షిణ మాసవారీ ఉత్సవం ఈనెల 11న బుధవారం నిర్వహిస్తున్నట్టు దుర్గగుడి ఈవో వీకే శీనానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉదయం 5.55 గంటలకు ఘాట్‌రోడ్డులోని టోల్ గేట్ వద్ద కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరిప్రదక్షిణ ప్రారంభమవుతుందని తెలిపారు. ఘాట్ రోడ్డు అమ్మవారి గుడి, కుమ్మరిపాలెం సెంటర్, విద్యాధరపురం, పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి నుండి ఇంద్రకీలాద్రి వరకు గిరి ప్రదక్షిణ జరుగుతుందని తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఈవో కోరారు.

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు వివిధ సేవల్లో విధులు నిర్వహిస్తున్న వేద పండితులు, అర్చకులు, పరిచారకులను ఈవో శీనానాయక్ అంతర్గత బదిలీ చేశారు. దేవదాయ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి ఆరు నెలలకు ఉద్యోగులతో పాటు వేదపండితులు, అర్చకులు, పరిచారకులను అంతర్గత బదిలీ చేస్తుంటారు. ఈ క్రమంలో పూర్వ ఈవో కేఎస్ రామారావు అంతర్గత బదిలీల కాలపరిమితి ముగియటంతో శీనా నాయక్ వేద పండితులు, అర్చకులు, పరిచారకులు ఎక్కడెక్కడ ఎంత కాలం నుంచి విధులు నిర్వహిస్తున్నారు.. అని పూర్తి సమాచారం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానంలో 40 మంది అర్చకులు, 20 మంది పరిచారకులను, 22 మంది వేద పండితుల్లో ముగ్గురిని బదిలీ చేశారు.

బెదిరిస్తున్న ఇద్దరు అర్చకులు..

అమ్మవారి ప్రధాన ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు అర్చకులను ఆలయ ప్రాంగణంలో వేరేచోటకు బదిలీ చేయటంతో వారు పలువురు అర్చకులను బెదిరిస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. తమను కావాలనే అంతర్గత బదిలీ చేశారని విస్తృత ప్రచారం చేస్తున్నట్టు తెలుస్తోంది. సీఎం కార్యాలయంలో ఓ ముఖ్య ఐఏఎస్ అధికారి తమకు తెలుసని, ఆయన పేరు చెప్పి ఆ ఇద్దరు అర్చకులు పలువురు అర్చకులపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ప్రచారం జరుగుతోంది.

విజయవాడ ఏఎంసీలో అధికారుల బదిలీ

విజయవాడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ మార్కెటింగ్ శాఖలో బదిలీలపై నిషేధం ఎత్తివేస్తూ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్, సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి (ఏఎంసీ) తీసుకున్న నిర్ణయంతో పలువురు అధికారులకు స్థానచలనం కలిగింది. విశాఖపట్నం ఏఎంసీలో డీడీఎం ఓడీ స్పెషల్ సెక్రటరీగా పనిచేస్తున్న పి.పాపారావు విజయవాడ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీపై రానున్నారు. విజయవాడ ఏఎంసీలో డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న పి.లావణ్య (డీడీఎం) కడప డీడీఎమ్ (అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్)కు బదిలీ అయ్యారు. ఏలూరు ఏఎంసీలో డీడీఎం (ఓడీ) ఎ.శారదరాణి విజయవాడ ఏఎంసీకి సెలక్షన్ గ్రేడ్ సెక్రటరి (ఓడీ)గా బదిలీపై వస్తున్నారు.

భ్రమల్లో బతికేస్తున్న జోగి : టీడీపీ కౌన్సిలర్లు



మాట్లాడుతున్న టీడీపీ కౌన్సిలర్లు

ఇబ్రహీంపట్నం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నేత, మాజీమంత్రి జోగి రమేష్ ఇంకా తాము అధికారంలో ఉన్నట్టు, మంత్రి హోదా వెలగబెడుతున్నట్టు కొండపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎవరో కూడా ఆయనే మీడియా సమావేశంలో ప్రకటిస్తూ భ్రమల్లో బతికేస్తున్నాడని టీడీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కౌన్సిలర్లు విలేకర్లతో మాట్లాడుతూ, కొండపల్లి మున్సిపాలిటీలో సీల్డ్ కవర్ ఓపెన్ సాంకేతిక కారణాలతో వాయిదా వేస్తే జోగి రమేష్ పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నాడన్నారు. వాయిదా వేస్తే ఓడిపోయినట్టు ఎలా అవుతుందని ప్రశ్నించారు. 2021లో చైర్మన్ ఎన్నిక జరిపిన సమయంలో అప్పటి ఎంపీ కేశినేని శ్రీనివాస్ ఓటుతో టీడీపీ బలం 16 ఉంటే ఆయనెలా సమానంగా ఉన్నామని చెబుతావని ప్రశ్నించారు. కొండపల్లి మున్సిపాలిటీ వైసీపీదే అని జగన్‌కు కానుకా ఇస్తున్నా అని, చైర్మన్, వైస్ చైర్మన్స్‌గా వైసీపీ వాళ్లు ఇకనుంచి పాలిస్తారని జోగి ప్రగల్భాలు పలకడం చూస్తుంటే ఆయన మానసిక స్థితి ఎలా ఉందో అర్థమవుతుందని దుయ్యబట్టారు. సంపూర్ణబలంతో కొండపల్లి మున్సిపాలిటీని టీడీపీ కౌవసం చేసుకోవడం ఖాయమన్నారు. పగటి కలలు కంటున్న జోగి పిచ్చి వాగుడు కట్టి పెట్టాలని హితవు పలికారు. సమావేశంలో చెన్నుబోయిన చిట్టిబాబు, చుట్టుకుదురు శ్రీనివాసరావు, చనమోలు నారాయణరావు, రావి ఫణి, మైలా సైదులు, అప్సర్, బసవ ఉమా తదితరులు పాల్గొన్నారు.

నందిగామ మార్కెట్ కమిటీ

పాలకవర్గం ఎంపికపై ఉత్కంఠ!

నందిగామ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : నందిగామ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఎంపికపై తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయింది. అయినా ఇంతవరకు కీలకమైన నామినేటెడ్ పదవుల పంపిణీ జరగకపోవడం నేతల్లో అసహనం రేపుతోంది. జిల్లా యూనిట్‌గా రిజర్వేషన్లలో నందిగామ ఏఎంసీ చైర్మన్ పీఠాన్ని బీసీ జనరల్‌కు కేటాయించారు. దీంతో పలువురు బీసీ నాయకులు పీఠం దక్కించుకొనేందుకు పోటీపడుతున్నారు. ఎవరికి వారు తమతమ మద్దతుదారులతో ఎమ్మెల్యేపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మౌనంపై ప్రజల్లో చర్చ సాగుతోంది. కొద్దికాలం పాటు హడావుడి సృష్టించిన ఆశావహులు నేడు నీరసించి నిలబడ్డారు. నియోజకవర్గంలో రెండో యార్డు అయిన కంచికచర్లకు కమిటీ చైర్మన్‌గా కోగంటి బాబును ఖరారు చేశారు. అయితే ఇప్పటికీ జీవో రాకపోవడంతో ఆయన కుర్చీ ఎక్కలేని పరిస్థితి. పార్టీ కోసం సుదీర్ఘ కాలం కష్టపడిన నేతలు నేడు పదవుల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. కాలయాపన వల్ల పదవీకాలం కరిగిపోతుందని, ఎవరో ఒకరికి అవకాశం ఇవ్వొచ్చు కదా అంటూ ఆశావహులు వాపోతున్నారు. ఇప్పటికైనా మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించాలని ఆశావహులు కోరుతున్నారు.

నీచపు రాతలు.. వికృత పోకడలు!

ఉగ్రవాదుల కంటే ఘోరం!

» ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్



గొల్లపూడి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : నీచపు రాతలు, వికృత పోకడలతో ఉగ్రవాదుల కంటే జగన్ మీడియా ఘోరంగా తయారైందని, ఇది సభ్య సమాజానికి పెను ప్రమాదమని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ వ్యాఖ్యానించారు. సోమవారం గొల్లపూడిలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జగన్ రోత పత్రిక ప్రచురిస్తున్న కథనాలు వెగటు పుట్టిస్తున్నాయని విమర్శించారు. ప్రజల, రైతుల ప్రయోజనాలు కాంక్షిస్తూ విజయవాడ నగరవాసులకు వరద ముప్పు నుంచి కాపాడేందుకు బుడమేరు కరకట్టలను బలోపేతం చేస్తుంటే జగన్ మీడియా తన అక్కసును వెళ్లగక్కుతూ అబద్ధాలను ప్రచారం చేస్తున్నదన్నారు. అమరావతి మహిళలను కించపరుస్తూ వ్యాఖ్యలను ప్రత్యక్ష ప్రసారం చేసిందని విమర్శించారు. గతేడాది అకాల వర్షాల కారణంగా బుడమేరు, దానికి అనుబంధంగా వాగులు, వంకలు, చెరువులు, కట్టలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఖరీఫ్ ప్రారంభంలోనే పాడైపోయిన వాటికి మరమ్మతులు చేసేందుకు సీఎం చంద్రబాబు, జలవనరులశాఖ మంత్రిని కలిసి, ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రత్యేక నిధులను కేటాయించినట్టు తెలిపారు. మంత్రివర్గంలో కూడా ఆమోదం లభించిందని, ఆర్థిక శాఖ నుంచి అనుమతులూ వచ్చాయని చెప్పారు. దీనిపై జగన్ పత్రిక బుడమేరు డైవర్షన్ చానల్ నిధులపై తప్పుడు ప్రచారం చేస్తున్నదన్నారు.

మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆగ్రహం

కలెక్టరేట్ : రాష్ట్ర రాజధాని అమరావతి ప్రాంతాన్ని, రాజధాని మహిళలపై చేసిన జుగుప్సాకరమైన, అనుచిత వ్యాఖ్యలపై మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ షిబ్లి మండిపడ్డారు. ఎం.హెచ్.పి.ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, జగన్ మీడియాపై విరుచుకుపడ్డారు. నాడు వెంకటాద్రినాయుడు చివరి పాలకునిగా అమరావతిని ఏలితే, నేడు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పరిపాలనలో ఆంధ్రప్రదేశ్ రాజధానికి అమరావతిగా అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేయడాన్ని జీర్ణించుకోలేక దిగజారుడుతనంతో జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేసిన కొమ్మినేని, కృష్ణంరాజు, జగన్ మీడియాపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో మౌలానా హుస్సేన్ అహ్మద్, అబ్దుల్ గఫూర్, అబ్దుల్ బాషా, మహిళా విభాగం నుంచి ఆయేషా, అఫ్రోజ్, రఫియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

జగన్ మీడియాపై జనాగ్రహం.. పత్రిక ప్రతుల దహనం



ఆటోనగర్‌లోని జగన్ పత్రికా కార్యాలయం వద్ద మహిళల ఆందోళన



జగన్ పత్రిక ప్రతులను దహనం చేస్తున్న టీడీపీ నేతలు

అమరావతి మహిళలకు క్షమాపణ చెప్పాలి

» ఎన్టీఆర్ జిల్లా టీడీపీ ఎస్సీసెల్

పాయకాపురం : అమరావతి రాజధానిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ సీనియర్ నేత చల్లగాలి అనిల్‌కుమార్ అన్నారు. అజిత్ సింగ్‌నగర్, దళితమార్గ్ సెంటర్ వద్ద సోమవారం జగన్ పత్రిక ప్రతులను దహనం చేశారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ, అమరావతిపై ముందు నుంచీ వైసిపి నేతలు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాజధానిపై బురదజల్లే ప్రయత్నం వైసీపీ నేతలు మానుకోవాలని హెచ్చరించారు. తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా టీఎన్‌టీయూసీ సెక్రటరీ తంగిరాల కొండ, విజయకృష్ణ సూపర్‌బజార్ డైరెక్టర్ వేల్పుల రాజేష్, బేబీ, చంటి, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ : గుడివాడ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నెహ్రూచౌక్ సెంటర్‌లో జగన్ పత్రిక ప్రతులను దహనం చేశారు. అమరావతి మహిళలను కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని అరెస్టు చేయాలన్నారు. సోమవారం రాత్రి స్థానిక ప్రజావేదిక నుంచి నెహ్రూచౌక్ సెంటర్ వరకు పార్టీ శ్రేణులు, తెలుగు మహిళలు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, రాజధాని మహిళలను అవమానిస్తే కూటమి ప్రభుత్వం చూస్తు ఊరుకోదన్నారు. యావత్ మహిళా లోకానికి భారతిరెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు యార్లగడ్డ సుధారాణి, గొర్ల శ్రీలక్ష్మి, పొట్లూరి రమాదేవి, మాదాల సునీత, కొల్లి రమ్య, సిరిపురపు తులసీరాణి, మల్లికాబేగం, నాయకులు సయ్యద్ జబీన్, వంగపండు ఆదినారాయణ, రామధేను వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.



కంకిపాడు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న అంగన్వాడీ డ్వాక్రా సంఘం మహిళా నేతలు

నీచపు రాతలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

కంకిపాడు : రాజధాని మహిళలపై నీచపు రాతలు రాసిన జగన్ పత్రికతో పాటు కొమ్మినేని శ్రీనివాస్‌పై కఠినచర్యలు తీసుకోవాలని అంగన్వాడీ డ్వాక్రా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు శివపార్వతి అన్నారు. కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కంకిపాడు స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాజధాని అభివృద్ధికి స్వచ్ఛందంగా భూములిచ్చిన రైతులను బ్లూ మీడియా అసత్య ప్రచారం చేయడంతో పాటు ఇష్టానుసారం మాట్లాడటం సిగ్గు చేటన్నారు. వీరిపై తక్షణం చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఎస్ శ్రీదేవి, నాగశ్రీ, డి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దేశంలో ఉగ్రవాదం, తీవ్రవాదం తగ్గుముఖం

» పాకిస్తాన్‌కు మోదీ గట్టి బుద్ధి చెప్పారు

» నక్సల్ ఉద్యమం ఆఖరి దశ

» ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణలో మంత్రి సత్యకుమార్ యాదవ్



హిందు సమ్మేళనంలో వీరఖడ్గాన్ని చూపుతున్న మంత్రి సత్యకుమార్, చిత్రంలో నెట్టెం రఘురాం, తాతయ్య తదితరులు

జగ్గయ్యపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రధానిగా మోదీ వచ్చాక దేశంలో ఉగ్ర దాడులు, తీవ్రవాదం తగ్గుముఖం పట్టాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. పాకిస్తాన్ పిరికిపంద చర్యలకు మోదీ సర్జికల్ స్ట్రైక్, ఆపరేషన్ సిందూర్‌లతో గట్టి సమాధానమిచ్చారని ప్రశంసించారు. నక్సలిజం చివరిదశకు చేరిందని, చర్చలకు మావోలు ముందుకు రావటమే తార్కాణమన్నారు. ఛత్రపతి శివాజీ వంటి వీరుల జీవితాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సోమవారం జగ్గయ్యపేట పట్టణంలో విజయవాడ రోడ్డులో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని తాత్వికులు చిట్టా లక్ష్మీనరసింహశాస్త్రి, స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం, జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తదితరులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం టీటీడీ కల్యాణ మండప స్థలంలో ఏర్పాటు చేసిన హిందు సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సత్యకుమార్ మాట్లాడుతూ, దేశానికి ఆదర్శంగా నిలిచిన మహనీయుల చరిత్రను భవిష్యత్‌తరాలకు అందించేందుకు కేంద్రం నడుం బిగించిందన్నారు. నెట్టెం రఘురాం మాట్లాడుతూ, హిందు సామ్రాజ్య స్థాపనకు ఛత్రపతి శివాజీ మహరాజ్ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ దేశం కోసం, హిందూ ధర్మం కోసం పోరాటం చేసిన వీరుల చరిత్రను నేటితరానికి తెలిసేందుకు చరిత్ర పాఠ్య పుస్తకాలలో చేర్చాలని కోరారు. సామినేని ఉదయభాను మాట్లాడుతూ నేటి తరానికి శివాజీ మహరాజ్ గురించి చెప్పేందుకు విగ్రహ ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేశారు. రాఘవేంద్ర మాట్లాడుతూ, జగ్గయ్యపేటలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఒకవైపు, 108 అడుగుల జాతీయ పతాకాలు ప్రజలకు స్ఫూర్తిని, చైతన్యాన్ని కలిగిస్తాయని చెప్పారు. ఆర్ఎస్ఎస్ నేత భరత్ మాట్లాడుతూ, హిందూ సామ్రాజ్యస్థాపన కోసం శివాజీ అలుపెరగని పోరాటం చేశాడని చెప్పారు. చాముండేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతీ స్వామి మాట్లాడుతూ, వచ్చే నెలలో గ్రామదేవతల ఆలయాల సందర్శన చేపడుతున్నట్టు తెలిపారు. శివాజీ మహరాజ్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు రూ.5.25 లక్షల విరాళాన్ని ఇచ్చిన మాజీ వైస్ చైర్మన్ నూకల కుమార్‌రాజాను, రూ.5లక్షల విరాళం ఇచ్చిన విష్ణును నేతలు సత్కరించారు.

చెత్తశుద్ధి కావాలి

(5వ పేజీ తరువాయి)

వ్యర్థాల నుంచి 100 టన్నుల వర్మీ కంపోస్టును ఉత్పత్తి చేయవచ్చు. నాడు పెద్దగా ఖర్చు లేకుండా కాలనీ అసోసియేషన్లు, ఎన్‌జీవోల సహకారంతో ఈ ప్లాంట్లు ప్రారంభించగా, ప్రస్తుతం నగరంలో ఒక్కటి కూడా కనిపించట్లేదు. కార్పొరేషన్ అధికారులు, జిల్లా యంత్రాంగం ఈ అంశంపై దృష్టిసారించి తిరిగి వర్మీ కంపోస్టు ప్లాంట్లకు ప్రోత్సహించడం ద్వారా సేంద్రియ వ్యర్థాల సద్వినియోగంతో పాటు సంపద సృష్టి దిశగా అడుగులు వేయొచ్చు. వర్మీ కంపోస్టు ప్లాంట్ పెట్టడానికి గరిష్ఠంగా రూ.3 లక్షలు అయ్యే అవకాశముంది. కార్పొరేషన్ స్థలాల్లో పక్కా భవనాలు కాకుండా, పాకలు వేసి ప్లాంట్లకు ఏర్పాటుచేయొచ్చు. ప్రతి కాలనీ సంఘానికి వీటి నిర్వహణ బాధ్యతలను అప్పగించటం ద్వారా వర్మీ ప్లాంట్లను మరింత సమర్థంగా నిర్వహించే అవకాశం ఉంటుంది.

సేంద్రియ వ్యర్థాలంటే..

కుళ్లిపోయే స్వభావం కలిగిన వ్యర్థాలనే సేంద్రియ వ్యర్థాలు అంటారు. రైతుబజార్లలో కూరగాయల వ్యర్థాలు, కల్యాణ మండపాల్లో భోజనాలు, హోటళ్లు, హాస్టళ్లలో వ్యర్థాలు ఈ సేంద్రియ కేటగిరీలోకి వస్తాయి. గతంలో సేంద్రియ, అసేంద్రియ వ్యర్థాల పేరుతో ఇంటింటికీ ప్రత్యేకంగా గ్రీన్, ఎల్లో ప్లాస్టిక్ డస్ట్‌బిన్లు ఇచ్చేవారు. వర్మీ కంపోస్టు ప్లాంట్లు ఏర్పాటుచేసిన ప్రాంతాల పరిధిలో డోర్ టు డోర్ చెత్త సేకరణ జరిగేది. ప్రస్తుతం ఈ విధానంలో ఎక్కడా చెత్త సేకరణ జరగట్లేదు.

గతమెంతో ఘనం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉండగా, నగర పరిధిలో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్టు ప్లాంట్ల వ్యవస్థను ప్రపంచ బ్యాంకు గుర్తించింది. ఆ బ్యాంకు బృందం నగరానికి వచ్చి వర్మీ కంపోస్టు ప్లాంట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఈ ప్లాంట్లలో వానపాములను పెంచి సేంద్రియ వ్యర్థాలను కరిగిస్తూ కంపోస్టును ఉత్పత్తి చేసే విధానాన్ని పరిశీలించింది. తమ వంతు సహకారం అందిస్తామని హామీ కూడా ఇచ్చింది. వీరి పర్యటనతో దేశస్థాయిలో నగరంలోని వర్మీ కంపోస్టు ప్లాంట్లకు మంచి పేరు వచ్చింది.

గుంటుపల్లిలో గుట్టుగా..

(5వ పేజీ తరువాయి)

చేశారు. ఆదివారం ఉదయం నుంచి లక్షలాది రూపాయల బెట్టింగ్‌లతో పందేలు వేశారు. గుంటుపల్లితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కార్లలో వచ్చి పందేలు వేశారు. ఆహారం, మందు కూడా సమకూర్చుకున్నారు. కార్లు బయటకు కనిపించకుండా తుప్పల మధ్య పార్కింగ్ ఏర్పాట్లు చేశారు.

అసలు వారిని వదిలి.. కొసరు వారిని ఇరికించి..

పందేల సమాచారం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం పోలీసులు ఈ శిబిరంపై దాడి చేశారు. ఈ దాడిలో ఐదు పుంజులు, ఏడుగురు బెట్టింగ్ రాయుళ్లను పట్టుకున్నారు. అయితే, ఎలాంటి నగదు లభించలేదు. ఖరీదైన కార్లలో వచ్చిన వ్యక్తులెవరూ పోలీసులకు చిక్కలేదు. విచిత్రమేమిటంటే.. పందేలకు వచ్చిన కార్లు కూడా అక్కడి నుంచి వెళ్లిపోయాయి. ఇబ్రహీంపట్నం పోలీసులు అసాంఘిక కార్యకలాపాలపై దాడిచేస్తే ఎలా ఉంటుందనడానికి నిదర్శనమే ఈ పరిణామం. పోలీసులు అదుపులోకి తీసుకున్న ఏడుగురిలో కార్లలో వచ్చిన వ్యక్తులెవరూ లేరు. ఆహారం, బీర్లు సరఫరా చేయడానికి ఏర్పాటు చేసుకున్న సహాయకులే ఉన్నారు. వీరిపై పెట్టీ కేసు నమోదు చేసి వదిలేశారు. సాధారణంగా పోలీసులు ఎక్కడైనా దాడి చేసి వ్యక్తులను పట్టుకున్నప్పుడు అక్కడున్న వాహనాలను సీజ్ చేస్తారు. ఈ కోడి పందేల శిబిరం వద్ద కనిపించిన కార్లను ఎందుకు పోలీస్‌స్టేషన్‌కు తరలించలేదన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆ అధికారి ఎవరు?

ఈ విషయంపై పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు సీరియస్‌గా ఉన్నారు. ఇబ్రహీంపట్నం పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గుంటుపల్లిలో నది ఒడ్డున కోడిపందేలు నిర్వహిస్తున్నారని ఆ సెక్టర్ ఎస్ఐ పైఅధికారులకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. ఆ ఎస్ఐను అక్కడి నుంచి బయటకు వచ్చేయమని ఓ అధికారి చెప్పినట్టు సమాచారం. ఆ అధికారి ఎవరన్న దానిపై సీపీ ఆరా తీశారు. దీనికి సంబంధించి పూర్తి సమాచారం తెలుసుకున్నాక ఇబ్రహీంపట్నం సిబ్బందిని సీపీ కార్యాలయానికి పిలిపించారు. మరోసారి ఇలాంటి వ్యవహారాలు కొనసాగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించినట్టు తెలిసింది.

పీహెచ్‌డీలా!

(5వ పేజీ తరువాయి)

సమాచారం. వీరంతా యూనివర్సిటీకి వచ్చి మాకు పీహెచ్‌డీ ఇవ్వాలని కోరుతుంటే మీ పరిశోధనపత్రాలు కనపడటం లేదని చెప్పి అధికారులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పీహెచ్‌డీ కోసం లక్షలాది రూపాయలు ఫీజులు కట్టిన స్కాలర్‌లు తమకు న్యాయం చేయాలని ఉన్నత విద్యామండలి అధికారులకు, గవర్నర్‌కు ఫిర్యాదు చేసినా యూనివర్సిటీ అధికారులు పట్టించుకోవడం లేదని తెలిసింది. పలువురు స్కాలర్‌లు పీహెచ్‌డీ పూర్తిచేశామని, పూర్తిస్థాయిలో ఫీజులు చెల్లించామని, తమకు వైవాను నిర్వహించి పట్టా ఇవ్వాలని యూనివర్సిటీ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఇంకా ఫీజులు చెల్లించాలని, అవి కడితే అప్పుడు చూద్దామని చెప్పి పంపేస్తున్నారు. ప్రైవేటు కళాశాలల్లో తక్కువ జీతానికి పనిచేస్తూ పీహెచ్‌డీ పూర్తిచేశామని, ఇప్పటికిప్పుడు పెద్దమొత్తంలో అదనంగా ఫీజులు చెల్లించలేమని స్కాలర్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, స్కాలర్‌లు సమర్పించిన పత్రాలు గతంలో ఎవరైనా చేసిన పరిశోధనల నుంచి కాపీ చేసి, వాటినే సమర్పించారా అనే అంశాన్ని తెలుసుకునేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఉండాలి. ఈ సాఫ్ట్‌వేర్‌ను నాలుగు సంవత్సరాల క్రితమే నిలిపివేశారు. సాఫ్ట్‌వేర్ కొనుగోలు చేయకుండా యూనివర్సిటీ అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

కలెక్టరేట్‌లో ‘మీ కోసం’

మచిలీపట్నం టౌన్ : కలెక్టరేట్‌లో సోమవారం ప్రజల నుంచి డీఆర్వో కె.చంద్రశేఖరరావు, కెఆర్‌ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఆర్డీవో స్వాతి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన బాధితులు తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి గ్రామానికి చెందిన అర్జా నాగబాబు భూమి అన్యాక్రాంతమవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

ఉసురు తీసిన కట్నం వేధింపులు!

» మామ ఫిర్యాదుతో అల్లుడి అరెస్టు



పుట్టల సదా

గుణదల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : నాన్నా డబ్బులు కావాలి.. అని కుమార్తె ఫోన్ చేయగా.. ఇప్పుడు లేవమ్మా రెండ్రోజులు ఆగు అని సర్దిచెప్పి ఫోన్ పెట్టిన రెండు గంటల వ్యవధిలోనే.. మీ కూతురు ఉరేసుకుందని అల్లుడు ఫోన్‌చేసి చెప్పడంతో ఆ తండ్రి హతాశుడయ్యాడు. ఈ ఘటన మాచవరం స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా వేములపల్లికి చెందిన వ్యవసాయ కూలీ పుట్టల సురేంద్ర్‌కు ఇద్దరు పిల్లలు. ఇంటర్ చదివిన కుమార్తె సదా(23) అదే ప్రాంతానికి చెందిన రమావత్ సైదాను 2021లో ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి మూడేళ్ల పాప ఉంది. వీరు జీవనోపాధి నిమిత్తం నగరానికి వచ్చి చుట్టుగుంట వద్ద నివాసం ఉంటున్నారు. భార్య, భర్తలు ఇద్దరూ ప్రైవేటు దంత వైద్యశాలలో పనిచేస్తున్నారు. ఇదిలా ఉండగా.. 10రోజుల క్రితం సదా తన పుట్టింటికి వెళ్లి తండ్రిని రూ. లక్ష కావాలని కోరింది. ఇప్పటికిప్పుడు అంటే డబ్బులు లేవమ్మా.. 15 రోజుల్లో తెచ్చి ఇవ్వగలనని తండ్రి చెప్పాడు. దాంతో గత శుక్రవారం ఆమె తిరిగి విజయవాడ చేరుకుంది. ఆదివారం సాయంత్రం మళ్లీ పుట్టింటికి ఫోన్ చేసి నాన్నా ఒక్క 20వేలు అయినా సర్దు అని అడగ్గా.. ఇప్పుడు లేవని చెప్పానుగా తల్లీ అని తండ్రి సమాధానం ఇచ్చి ఫోన్ పెట్టేశాడు. ఫోన్ పెట్టిన రెండు గంటల వ్యవధిలోనే అల్లుడు మామకు ఫోన్‌చేసి మీ కూతురు ఉరేసుకుందని చెప్పాడు. కుమార్తె మృతిచెందిన విషయం తెలుసుకున్న తండ్రి బంధువర్గంతో సోమవారం ఉదయం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. మార్చురీలో విగతజీవిగా పడివున్న కుమార్తెను చూసి తండ్రి విలవిలలాడిపోయాడు. ఆమె వంటిపై దెబ్బలు ఉండటంతో నా కుమార్తెను అదనపు కట్నం కోసం వేధించి మృతికి కారకుడైన అల్లుడు రమావత్ సైదాపై చర్యలు తీసుకోవాలని మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు సైదాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు మాచవరం పోలీసులు తెలిపారు.

కాలువల నిర్వహణపై కలవరం

(5వ పేజీ తరువాయి)

లాకులు బిగించడం, డ్రెయిన్లను పూడికతీయడం వంటి పనులు చేపట్టాలని అధికారులను ఎన్నిసార్లు అడిగినా దాటవేత ధోరణిలో సమాధానాలు చెబుతున్నారే తప్ప పనులు చేయట్లేదు. సాగు నీరందక నారు మడులు ఎండిపోయినా, భారీ వర్షాలతో పొలాలు మునిగిపోయినా అధికారులదే బాధ్యత. మునిగిపోయిన తర్వాత నష్టపరిహారం ఇచ్చే బదులు ముందస్తుగానే కాలువలు, డ్రెయిన్లను బాగుచేస్తే బాగుంటుంది.

- పెదర్ల యామినీ ప్రసాద్, ఆరుగొలను

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	116, 125, 136
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

సింగన్నగూడెం సోమేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి విరాళం



హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : సింగన్నగూడెంలో పునర్నిర్మిస్తున్న గంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి నిమిత్తం మడుపల్లి సుబ్బారావు, శకుంతల దంపతులు విరాళం అందజేశారు. ఉప సర్పంచ్ బెజవాడ కృష్ణారావు ఆధ్వర్యంలో రూ.50,116 విరాళాన్ని సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కొట్టే రాజా, బత్తుల రామ్మోహనరావు, సమ్మెట సాంబశివరావు, పర్వతనేని రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



బోరును పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

తాగునీటి ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలి

గన్నవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఉన్న తాగునీటి ట్యాంకులను తప్పనిసరిగా శుభ్రం చేయాలని ఆత్కూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు అన్నారు. మండలంలోని కొత్తగూడెంలో సోమవారం పర్యటించి తాగునీటి ట్యాంకులు, బోర్లను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి రవికాంత్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సురేష్‌తో సమీక్షించారు. ట్యాంకులను కడిగిన తరువాత క్లోరినేషన్ చేయాలని, రిజిస్టర్‌లలో నమోదు చేయాలని సూచించారు. పైప్‌లైన్‌లు లీకేజీ లేకుండా చూడాలని అలా ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని చెప్పారు.



ఆనందపురంలో జాతీయ రహదారి పక్కన తవ్విన గుంతను పూడ్చుతున్న పంచాయతీ సిబ్బంది

గుంత పూడ్చివేత

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఉయ్యూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : గండిగుంట పంచాయతీ పరిధి ఆనందపురం వద్ద జాతీయ రహదారి పక్కన తవ్విన గుంతను పంచాతీయ సిబ్బంది సోమ వారం పూడ్చారు. వాటర్ పైప్‌లైన్ లీకై నీరు వృథాగా పోతుండగా పైప్‌లైన్‌కు మరమ్మతు చేసేందుకు జాతీయ రహదారి పక్కన పంచాయతీ సిబ్బంది ఇటీవల పెద్ద గుంత తవ్వి మరమ్మతు చేయకుండా వదిలివేసిన వైనాన్ని "ఆదమరిస్తే గుంతే" అనే శీర్షికన ఆదివారం ఆంధ్ర జ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పదించిన కార్యదర్శి శ్రీకుమార్ పైప్‌లైన్ మరమ్మతు చేయించి గుంత పూడ్చించారు.


టీవీ అందజేత

గన్నవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దావాజీగూడెం స్పందన మానసిక వికాస కేంద్రానికి టీవీని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమ వారం అందజేశారు. గన్నమనేని పూర్ణచంద్ సహకారంతో టీవీని అందజేసినట్లు సేవా సంస్థ అధ్యక్షులు మడుపల్లి బాలకృష్ణమూర్తి తెలిపారు. దాతల సహకారంతో సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్నట్లు చెప్పారు. కార్యదర్శి కర్ర వరప్రసాద్, వీసం ప్రసాద రావు, పొట్లూరి రామకృష్ణారావు, సయ్యద్ లాల్, శేఖర్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మురళీనగర్ అంగన్వాడీలో బడిబాట

పెనమలూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీ కానూరులోని మురళీనగర్ అంగన్వాడీలో బడిబాట పిలుస్తోంది కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రీస్కూల్‌కు వచ్చే పిల్లల తల్లిదండ్రులకు అంగన్వాడీ కేంద్రంలో అందించే సదుపాయాలు, ప్రీ స్కూల్ పిల్లలకు బోధించే నవచేతన, ఆధారశీల గురించి వివరించి, ఆటలు, పాటలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి. విజయలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రంగయ్యప్పారావుపేటలో గోవింద నామ పుస్తకాలను అందజేస్తున్న పాండురంగారావు

ప్రజల్లో భక్తి పెంచేందుకు గోవింద నామావళి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజల్లో భక్తి, విశ్వాసాలు పెంపొందించేందుకు తద్వారా అయోధ్యలో నిర్మించే సహస్ర కోటి గోవింద నామస్తూప నిర్మాణంలో భాగస్వాములను చేసేందుకు గోవింద నామావళిని అందజేస్తున్నట్లు ధర్మ ప్రచారక్ యడవల్లి పాండురంగారావు తెలిపారు. రంగయ్యప్పారావుపేటలో మహిళలు, పురుషులకు సోమవారం గోవింద నామావళి పుస్తకాలను అందజేశారు. శ్రీవేంకటేశ్వరస్వామి 108 నామావళిని పలుకుతూ పుస్తకాన్ని పూర్తిచేయాలని భక్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కన్వీనర్ శేఖర్, జ్యోతి, నిర్మల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

యోగాంధ్ర -2025 అవగాహన ర్యాలీలో తాడిగడప మునిసిపల్ కమిషనర్ పి. భవానీప్రసాద్





కానూరులో యోగాంధ్ర అవగాహన ర్యాలీ.. ఉయ్యూరు నగర పంచాయతీ ఆధ్వర్యంలో..

కానూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : యోగాతో సంపూర్ణ ఆరోగ్యమని, ప్రతి ఒక్కరూ నిత్యం యోగా సాధన చేయాలని తాడిగడప మున్సిపల్ కమిషనర్ పి. భవానీప్రసాద్ అన్నారు. సోమవారం కానూరులో యోగాంధ్ర-2025 అవగాహన ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల నుంచి వంద అడుగుల రోడ్డు జంక్షన్‌లో ఆల్ఫా కేఫ్ వరకు సాగింది. ఈ ర్యాలీని కమిషనర్ పి. భవానీ ప్రసాద్ ప్రారంభించి మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ తమ ఆరోగ్య పరిరక్షణలో భాగంగా నిత్యం కొద్ది సేపు యోగా చేయాలని సూచించారు. దీనివల్ల రాష్ట్రం యోగాంధ్రగా మారుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డి. కిరణ్ కుమార్, టీడీపీ నేత దోనేపూడి రవికిరణ్‌తో పాటు మున్సిపల్, సచివాలయం సిబ్బంది, సీనియర్ సిటిజన్స్, శానిటరీ మేస్త్రీలు, పబ్లిక్ వర్కర్లు పాల్గొన్నారు.

ఉయ్యూరు నగర పంచాయతీ ఆధ్వర్యంలో..

ఉయ్యూరు : యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉయ్యూరు నగర పంచాయతీ ఆధ్వర్యంలో యోగాసనాలవల్ల ప్రయోజనాలు తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. నగర పంచాయతీ కార్యాలయం నుంచి బస్‌స్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. కమిషనర్ పి.వెంకటేశ్వరరావు, ఉద్యోగులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో యోగాంధ్ర ర్యాలీ నిర్వహించి యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత తెలియజేశారు. ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : యోగాంధ్ర - 2025 కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు ప్రజలకు విజప్తి చేశారు. యోగాంధ్ర 2025 కార్యాచరణలో భాగంగా సోమవారం బాపులపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి పూర్ణేశ్వరి ఆధ్వర్యంలో సచివాలయం సిబ్బంది. పంచాయతీ కార్మికులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. జంక్షన్ కూటమి నాయకులు అట్లూరి శ్రీనివాసరావు, తోట మురళీధర్ ఆధ్వర్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆవరణపై ప్రజలకు ఉచిత యోగ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యోగా గురువు రామకృష్ణ శిక్షణ ఇచ్చారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : అన్ని వయస్సుల వారు యోగా సాధనతో ఒత్తిడిని జయించడం ద్వారా మానసిక ఆరోగ్యం, రోగ నిరోధకశక్తి ద్వారా శారీరక ఆరోగ్యం పెరుగు తుందని ప్రతి ఒక్కరూ యోగా శిక్షణ తీసుకోవడం అవసరమని సర్పంచ్ పిల్లా అనిత, కాటూరు విజయభాస్కర్, మాజీ సర్పంచ్ చింతల వెంకటశివఅప్పారావు వేర్వేరు కార్యక్రమాల్లో అన్నారు. కాను మోలు, వేలేరు, బొమ్ములూరు, వీరవల్లి, ఎస్.ఎన్.పాలెం. దంటగుంట్ల తదితర గ్రామాల్లో సోమవారం యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.





జంక్షన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బాపులపాడు పంచాయతీ సిబ్బంది.. కానుమోలులో..

కాలువల పూడికతీత పనులు వేగవంతం చేయాలి

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



సీఎం చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, అధికారులు

గన్నవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : కాలువల మరమ్మతుల పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. మండలంలోని దావాజీ గూడెం ఏలూరు కాలువలో జరుగుతున్న పనులను సోమ వారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాకముందే కాలువల అభివృద్ధి పనులు పూర్తిచేయాలన్నారు. కాలువలు అభివృద్ధి జరిగితే చివరి వరకూ నీరు అందుతుందని, గతంలో పాలకులు కాలువలను నిర్లక్ష్యం చేశారని, రైతులు నీరందక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ముందు ఆలోచనలతో కాలువల్లో పూడికతీత, మరమ్మతు పనులు చేపట్టిందని చెప్పారు. నీటి సంఘం అధ్యక్షులు పనులను నిరంతరం పర్యవేక్షిస్తుండాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. డీసీ చైర్మన్ కొసరాజు రాంబాబు, సవలం ఎర్రబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

పి.4 సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి.ఫోర్ పథకంలో పారిశ్రామికవేత్తలు, ఎన్నారైలు, స్వచ్ఛంద సేవకులను భాగస్వాములు చేయడంతో పాటు ఈ పథకం పట్ల ఆసక్తిగలవారిని గుర్తించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌ను సోమవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో కలిసి యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. అనంతరం విజన్ యాక్షన్ ప్లాన్‌పై అధికారులకు యార్లగడ్డ దిశా నిర్దేశం చేస్తూ నియోజక వర్గంలో పి.4 సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. లబ్ధిదారులను గుర్తించడంతో పాటు బంగారు కుటుంబాలను, ఔత్సాహితులను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. తహసిల్దార్‌లు, ఎంపీడీవోలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేలేరులో చెరువు ఆక్రమణలు

● **కోర్టు ఉత్తర్వులున్నా.. ఆగని నిర్మాణ పనులు**



మళ్లీ మొదలైన నిర్మాణ పనులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి చెరువులు, కుంటలను ఆక్రమించరాదని కోర్టు ఉత్తర్వులున్నా, ఆక్రమణలు తొలగించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశించినా అధికారుల్లో మాత్రం చలనం లేదు. వేలేరులోని సాగునీటి చెరువైన చిన్న మల్లగుంటలో కొందరు వ్యక్తులు ఆక్రమించి కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ నిర్మాణ పనులను కొనసాగిస్తున్నారు. ఈ సాగునీటి చెరువు 19ఎకరాల విస్తీర్ణంతో సుమారు 860 ఎకరాలకు పైగా సాగు నీరందిస్తుందని స్థానిక రైతులు తెలిపారు. ఆక్రమణలపై దోనవల్లి శ్రీనివాసరావు, సత్యనారాయణ, అవిర్నేని నంబూద్రి ప్రసాద్, బాలచంద్రరావు, వీర్ల బ్రహ్మం, గోళ్ల శివనాగమల్లేశ్వరరావు తదితరులు 2023 సంవత్సరంలో కోర్టుకు వెళ్లి స్టే ఆర్డర్ తెచ్చారని తెలిపారు. కానీ కోర్టు వారి ఆదేశాలను బేఖాతరు చేస్తూ కొందరు వ్యక్తులు తమ స్వార్థప్ర యోజనాల కోసం సాగునీటి చెరువును ఆక్రమించి నిర్మాణ పనులను మళ్లీ మొదలు పెట్టారని తెలిపారు. రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులకు తెలియజేసినా ఏవిధమైన చర్యలు తీసుకోలేదని రైతులు వాపోయారు. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

షైనింగ్ స్టార్స్ అవార్డులు అందుకున్న విద్యార్థులు



అవార్డులు అందుకున్న గురుకుల విద్యార్థులు

ఉయ్యూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు మండలానికి చెందిన ఏడుగురు విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి షైనింగ్ స్టార్స్ అవార్డులు లభించాయి. మచిలీపట్నంలో సోమవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ గంగాధర్‌రావు, ఇతర అధికారుల నుంచి ఒక్కొక్కరు రూ. 20వేలు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన సమ్మెట వినూత్న, కె.గ్రీష్మశ్రీ, సీహెచ్ అక్షయ్‌పాల్, నారాయణ స్కూల్‌కు చెందిన కె ఎస్ శరణ్య, శ్రీశ్రీనివాస స్కూల్‌కు చెందిన కె.జోత్స్నదేవి, గంధం అనూష, ఫ్లోరా స్కూల్‌కు చెందిన కె.నిఖిత అవార్డులు అందుకున్నారు.

గన్నవరం : మండలంలోని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులను సోమవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ అభినందించారు. మచిలీపట్నంలో జరిగిన ప్రతిభా అవార్డుల కార్యక్రమంలో పదవ తరగతి విద్యార్థినీ పి.శృతి, సీనియర్ బైపీసీ విద్యార్థినీ ఎన్.ఇందులకు మెడల్, రూ. 20వేలు నగదు అవార్డులు, సర్టిఫికెట్ అందుకున్నారు.

కాలువల గండ్లను పూడ్చండి

స్పందనలో తహసీల్దార్‌కు రైతు సంఘం నేతల వినతి

ఉంగుటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : సార్వా వ్యవసాయ సీజన్ మొదలైన తరుణంలో మండలంలో ప్రధాన సాగునీటి వనరులైన బుడమేరు, మున్నేరు, పెదఅవుటపల్లి ఛానల్‌కు పడిన గండ్లను పూడ్చేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్ జాలాది విమలకుమారికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు అజ్మీర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, గత ఏడాది ఆగస్టు. సెప్టెంబరు నెలల్లో సంభవించిన వరదలకు బుడమేరు, ఇతర పంటకాలువలకి పలుచోట్ల గండ్లుపడి మండలంలో తరిగొప్పుల, వేంపాడు, వెల్దిపాడు, ఎలుకపాడు, ఇందుపల్లి, ఉంగుటూరు, లంకపల్లి, ముక్కపాడు, ఆముదాలపల్లి, కొయ్యగూరపాడు తదితర గ్రామాల్లో ఇళ్లు, పొలాలు నీటమునిగి ప్రజలు, రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. పడిన గండ్ల పూడ్చివేత పనులు వెంటనే చేపట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వి బి.సూర్యకాంతి, రైతులు కర్నాటి వీరరాఘవులు, పి.నాగేశ్వరరావు, జలసూత్రం మద్ది రామయ్య, వెంకటేశ్వరరావు, టి.గోపాల్, వి.శివకోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, నోట్ బుక్స్ అందజేత

గన్నవరం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పీఆర్‌కే ఫౌండేషన్ అధినేత పారా రామకృష్ణ అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు కళాశాలకు వెళ్లేందుకు బ్యాగులు, నోట్‌బుక్స్, ఇతర విద్యా ఉపకరణాలతో పాటు నగదు ప్రోత్సాహాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, పేద విద్యార్థుల అభ్యున్నతికి తనవంతు సహకారం ఎప్పుడు ఉంటుందని తెలిపారు. చదువులో రాణిస్తేనే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. సర్పంచ్ నిడమర్తి సౌజన్య మాట్లాడుతూ, పేద విద్యార్థులకు అండగా నిలవటం అభినందనీయమన్నారు. పీఆర్‌కే ఫౌండేషన్ మరింత సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని ఆకాంక్షించారు. ఎంఈఎఫ్ అధ్యక్షులు దేవరపల్లి విక్టర్‌బాబు, పీడీ ధనియాల నాగరాజు, నిడమర్తి నాగేశ్వరరావు, చక్రవర్తి, ఏలియా, అంజియ్య, అన్నే జ్యోతి, మల్లీశ్వరీ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బ్యాగులు, నోట్ బుక్స్ అందజేసిన పారా రామకృష్ణ



ఆస్ట్రేలియాలోని ఎన్నారైలతో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తదితరులు

సిడ్నీ మహానాడులో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఆస్ట్రేలియాలోని సిడ్నీ మహానాడు, ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకల్లో పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సతీసమేతంగా హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొనడానికి నందమూరి రామకృష్ణ, నారారోహిత్, నన్నూరి నర్సిరెడ్డి, అట్లూరి అశ్విన్ తదితరులు వచ్చారు. వీరందరికీ సిడ్నీ ఎన్నారై కుటుంబసభ్యులు స్వాగతం పలికారు.

ఆంజనేయస్వామిని దర్శించుకున్న నటుడు రాము



హనుమాన్‌జంక్షన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అభయాంజనేయస్వామి ఆలయాన్ని కన్నడ నటుడు, కేజీఎఫ్ -1 చిత్రంలో విలన్ పాత్రధారి గరుడ రాము (రామచంద్రరాజు) సోమవారం సందర్శించారు. ఆయన వైజాగ్ వైపు నుంచి విజయవాడ వెళుతూ మార్గమధ్యంలో అభయాంజనేయస్వా మి ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆలయ మర్యాదలతో సత్కరించి ఆశీర్వచనాలు అందజేశారు.

మైలవరానికి.. మహర్దశ!

● అమరావతి అభివృద్ధే నియోజకవర్గానికి వరం ● సీఆర్‌డీఏలో త్రీ టైర్ పట్టణంగా నమోదు

ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం: రాజధాని అమరావతికి గేట్ వేగా మూలపాడు ప్రాంతం నిలవబోతుండటం, స్పోర్ట్స్ సిటీ, అవుటర్ రిం గ్ రోడ్డు, విజయవాడ - ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హై వే ఏర్పాటు కాబోతుండటం వంటివి సీఆర్‌డీఏలో పట్టణ ప్రాంతంగా ఉన్న మైలవరం ప్రాంతానికి మహర్దశ పట్టించబోతున్నాయి. భవిష్యత్‌లో మహా పట్టణంగా వెలుగొందడం ఖాయం. రాజకీయంగా ఎంతో చైతన్యవంతమై న మైలవరం పాలకుల నిర్లక్ష్యానికి గురయిందనే చెప్పాలి. నియోజకవర్గానికి ముఖ్యకేంద్రమైనా అభివృద్ధి మాత్రం ఆమడదూరంలోనే ఆగింది. అమరావతి చుట్టూ నిర్మించనున్న అ వుటర్ రింగ్ రోడ్డుతో మైలవరం దశ తిరగబోతుంది. వాణిజ్య, వ్యాపారపరంగా అభివృద్ధి చెందబోతుంది. ఈ అవుటర్ పూర్తయితే ఇబ్రహీంపట్నం - చత్తీస్‌గఢ్ 30వ నంబరు జాతీ య రహదారి, విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారులు కలిసిపోతాయి. ఖమ్మం - విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవేని అవుట్ రింగ్ రోడ్డు జి.కొండూరు మండలం పెట్రంపాడు వద్ద క్రాస్ చేస్తుంది. ఆ ప్రాంతంలో అవుటర్ రింగ్ రోడ్డుపైకి గ్రీన్ ఫీల్డ్ హైవే వాహనాలు మళ్లిస్తే అక్కడి నుంచి కేవలం 10 నిముషాల్లో మైలవరం చేరుకోవచ్చు.


మైలవరం మెయిన్ సెంటర్

నియోజకవర్గంలో విస్తృత అభివృద్ధి

అమరావతి అభివృద్ధిలో భాగంగా నియోజకవర్గంలో పలు ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నారు. మూలపాడు, కొటికలపూడి, జమిపోతవరం, త్రిలోచనపురం గ్రామాల్లో స్పోర్ట్స్ సిటీ, స్పోర్ట్స్ వర్సిటీ నిర్మాణానికి ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ ద్వారా భూ సేకరణకు సన్నాహాలు చేస్తోంది. ఇవన్నీ ఏర్పడి, మూలపాడు వద్ద రాజధాని అమరావతి ముఖ ద్వారం ఏర్పాటు చేసి కృష్ణానదిపై వంతెన నిర్మాణం జరిగితే మైలవరం నియోజకవర్గం పూర్తిగా రాజధానిలో కలిసిపోతుంది. పైగా ఎర్రుపాలెం నుంచి గుంటూరు జిల్లా నంబూరు వరకు వేయనున్న రైల్వే మార్గం కూడా నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాలను కలిసి వెళ్తుండటం కలిసి వచ్చే అంశంగా చెప్పుకోవచ్చు.

కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలు

● ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవంలో కలెక్టర్ బాలాజీ ● షైనింగ్ స్టార్స్ పేరుతో అవార్డులు

మచిలీపట్నం టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదలతో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకునేందుకు విద్యార్థులు తగిన కృషి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. 10వ తరగతిలో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు ఇంటర్‌లో 830 మార్కులకు పైగా సాధించిన 201 మంది విద్యార్థులకు కలెక్టర్ ప్రతిభ అవార్డులు అందజేశారు. ఈ అవార్డుల్లో భాగంగా విద్యార్థులకు ఒక ప్రశంసా పత్రం, రూ.20వేల నగదు, ఒక మెడల్, ఒక పుస్తకం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. విజయగాధలను వివరించారు. విద్యార్థి దశ నుంచి చెడు అలవాట్లకు దూరంగా ఏదో ఒక రంగంలో పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నారు. జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ మాట్లాడుతూ తాను టీచర్‌గా చేరి ఉన్నతస్థితికి ఎదగాలనే పట్టుదలతో ఐపీఎస్ అధికారి అయ్యానన్నారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ తల్లిదండ్రులు, విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. జీవితంలో ఎదిగేందుకు ఆత్మవిశ్వాసం, ధైర్యం అవసరమన్నారు. ఇంటర్ అధికారి ఆర్‌ఐవో సాల్మన్‌రాజు, డీఈవో పీవీజే రామారావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, వీరంకి గురుమూర్తి మాట్లాడారు. కలల కుటీరంలో భాగంగా విద్యార్థులు తమకు నచ్చిన ప్రముఖుల వద్ద ఫొటోలు దిగారు. తమ అభిప్రాయాలను వర్ణిస్తూ నక్షత్రాల్లో రాశారు. ఎంతో కన్నుల పండుగగా జరిగిన ఈ కార్యక్రమంలో 201 మంది విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రతిభా పురస్కారాల నిధులను అధికారులకు అందజేస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఈవో రామారావు, ఇంటర్ అధికారి సాల్మన్ రాజు


కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్షల్లో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

ఉపాధ్యాయ సంఘాల నేతల దీక్షలు

మచిలీపట్నం టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడు టీచర్లకు మాన్యువల్‌గా బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాలంటూ సోమవారం కలెక్టరేట్ ఉపాధ్యాయ సంఘాల నేతలు నిరాహార దీక్షలు నిర్వహించారు. వెబ్ కౌన్సెలింగ్‌తో టీచర్లు తీవ్రంగా నష్టపోతారని దీక్షల్లో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ నేతలు బి కనకారావు, ఏ సుందరయ్య, కేఏ ఉమామహేశ్వరరావు, ఏపీటీఎఫ్ నేతలు బీ లంకేశ్, జీ సత్యనారాయణ, పీ పాండురంగ ప్రసాద్, ఏ సుబ్రహ్మణ్యం, రాధిక, ఈవీ రామారావు, ఎస్టీయూ నేతలు చంద్రశేఖర్, ఏపీటీఎఫ్ నేతలు తమ్ము నాగరాజు, ఏపీపీటీఏ నేతలు ఏఆర్ అస్లాం, పీఆర్‌టీయూ నేతలు పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు శిబిరంలో మాట్లాడారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో దాదాపు 4,300 మంది సెకండరీ గ్రేడు టీచర్లు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారని సంఘ నేతలు పీ పాండురంగ వరప్రసాద్, తమ్ము నాగరాజు, కేఏ ఉమామహేశ్వరరావు అన్నారు. ఎన్నికల ముందు టీచర్లకు ఇబ్బందులు కలుగనీయమని లోకేశ్ వాగ్దానం చేశారన్నారు. వాటిని నిలుపుకుని టీచర్లకు న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఉపాధ్యాయ సంఘాల నేతలు ఉద్యమిస్తున్నారని, సమస్య జటిలతను ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాలన్నారు.

కంచికచర్ల హెచ్‌సీపై వేటు

● పేకాట ఎఫెక్ట్

విజయవాడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కంచికచర్ల హెడ్ కానిస్టేబుల్ ప్రభుకుమార్‌పై వేటుకు రంగం సిద్ధమైంది. ఆయన్ను విధుల నుంచి సస్పెండ్ చేయాలని అధికారులు నిర్ణయించారు. నివాసముంటున్న ఇంటికి పక్కనే ఉన్న ఇంట్లో పేకాట నిర్వహించడంతో ఆయన్ను విధుల నుంచి తప్పించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కొండపల్లిలోని ఎస్టీ కాలనీలో ఉంటున్న ప్రభుకుమార్ కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం తన ఇంటికి పక్కనే ఉన్న ఇంట్లో పేకాట శిబిరం ఏర్పాటు చేయడం, అందులో ఆయన భాగస్వామి అవడం, పోలీసులు అరెస్టు చేయడం తెలిసిందే. అయితే ఈ విషయాన్ని గోప్యంగా ఉంచాలని ఇబ్రహీంపట్నం పోలీసులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో సీరియస్ అయ్యారు. సోమవారం ఉదయం నిర్వహించిన సెల్ కాన్ఫరెన్స్‌లో ప్రభుకుమార్‌ను సస్పెండ్ చేయాలని సీపీ రాజశేఖరబాబు ఆదేశాలిచ్చారు.

రేపు అండర్-18 బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపికలు

విజయవాడ స్పోర్ట్స్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అండర్ -18 బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపికలు ఈ నెల 11న నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్ తెలిపారు. ఈ ఎంపికలు కాకినాడలోని జేఎన్‌టీయూ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతాయని, ఎంపికైన జట్లు ఈ నెల 28 నుంచి జూలై 1 వరకు ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జరిగే ఫస్ట్ జూనియర్ నేషనల్ కబడ్డీ చాంపియన్‌షిప్ అండర్-18లో పాల్గొంటాయని తెలిపారు. ఈ ఎంపికలల్లో పాల్గొనే క్రీడాకారులు 15 నుంచి 18 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలని, బాలురు 70 కేజీలు, బాలికలు 65 కేజీలలోపు బరువు కలిగి ఉండాలన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీలు తమ జిల్లాలోని అత్యుత్తమ ప్రతిభగల క్రీడాకారులను ఈ ఎంపికకు హాజరయ్యేలా సహకరించాలని కోరారు.

ఇగ్నోలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో వచ్చేనెల నుంచి ప్రారంభమయ్యే విద్యా సంవత్సరానికిగాను, పోస్టు గ్రాడ్యుయేషన్ (పీజీ) డిగ్రీ, డిగ్రీ ఆనర్స్, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రాంతీయ కేంద్రం సీనియర్ సంచాలకుడు డాక్టర్ బీఆర్ శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో జూలై 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పీజీ రెండో సంవత్సరం, డిగ్రీ రెండు, 3వ సంవత్సరం, సెమిస్టర్ విధానంలో చదివే విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా జూలై 15 లోపల ప్రీ రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించాలని కోరారు. వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్‌ను సందర్శించాలని, లేదా విజయవాడ కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలోని ఇగ్నో ప్రాంతీయ కార్యాలయంలో స్వయంగా గానీ, లేదా 0866-2565253 ఫోన్‌లోగానీ తెలుసుకోవచ్చునన్నారు.


విద్యుత్ అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న విజయకుమారి

విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారుల

ఆకస్మిక తనిఖీలు

● కానూరు సెక్షన్‌లో 37 బృందాలుగా ఏర్పడి దాడులు
● 120 కేసులు నమోదు.. రూ. 4.36 లక్షల అపరాధ రుసుం

కానూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అక్రమ వినియోగం జరుగుతున్నట్టు సమాచారం అందడంతో సోమవారం గుణదల డివిజన్ పరిధిలోని కానూరు సెక్షన్‌లో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యుత్ విజిలెన్స్ ఆపరేషన్ అధికారులు 37 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో 120 కేసులు నమోదు చేసి రూ.4.36లక్షలు అపరాధరుసుం విధించారు. ఇందులో అధికంగా వాడుకుంటున్న విద్యుత్ లోడ్‌తోపాటు ఒక కేటగిరి నుంచి ఇంకో కేటగిరికి విద్యుత్ వాడకం గుర్తించారు. అలాగే తక్కువ బిల్లు వస్తున్న సర్వీస్‌లను కూడా గుర్తించి క్రమబద్ధీకరణ చేసుకోవాలని వినియోగదారులకు నోటీసులను అధికారులు అందజేశారు. ఈ దాడుల్లో గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీ హరిబాబు, విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీ విజయకుమారి, డీఈ నవీన్‌కుమార్, కానూరు ఏఈ వంశీకృష్ణ, విజిలెన్స్ ఏఈలు, ఏడీఈతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా తొలుత డివిజన్‌లోని లైన్‌మెన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్‌లకు వారి విధులు, వారి బాధ్యతలను గురించి, ఫీల్డ్‌లో లైన్‌ల మీద పనిచేసే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి వారి సిబ్బందికి వివరించారు.

యోగాతోనే ఆరోగ్య వైభోగం

● కలెక్టర్ లక్ష్మీశ ● నగరంలో 3వేల మందితో మెగా యోగాంధ్ర ర్యాలీ
● ర్యాలీకి తరలివచ్చిన ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలు, యోగా ఔత్సాహికులు...

కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యోగా ఆవశ్యకతను చాటిచెప్పేందుకు నిర్వహిస్తున్న యోగాంధ్ర ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని, జిల్లాలో 10 లక్షల మందికి యోగాసనాలు నేర్పేందుకు 5వేల మంది ట్రైనర్లతో శిక్షణ ఇస్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా జిల్లా అధికారులు, వీఎంసీ, ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు ర్యాలీని కలెక్టర్ లక్ష్మీశ, అధికారులతో కలిసి ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి వడివడిగా అడుగులేస్తూ యోగాసనాల ఉపయోగాలను చాటిచెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రాష్ట్రంలో జూన్ 21 నాటికి కనీసం 2 కోట్ల మందికి, జిల్లాలో దాదాపు 10 లక్షల మందికి యోగాసనాలను నేర్పించేందుకు ప్రతి గ్రామం, పట్టణంలోనూ యోగాంధ్ర నిర్వహిస్తున్నామన్నారు. రోజూ వివిధ వర్గాల వారితో చిన్నారుల నుంచి సీనియర్ సిటిజన్స్ వరకు అందరికీ యోగాసనాలను చేరువచేసేందుకు కృషిచేస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు.

యోగాసనాలు వేయండి

'యోగాసనాలు వేయండి, ఆరోగ్యాన్ని కాపాడుకోండి' అనే నినాదంతో యోగాపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ నిపుణులతో రూపొందించిన 45 నిమిషాల సరళ యోగా కామన్ ప్రొటోకాల్‌తో యోగాసనాలను నేర్పిస్తున్నట్టు వివరించారు. అనంతరం ఆయన అధికారులతో కలిసి డ్రగ్స్ వద్దు బ్రో (1972 టోల్ ఫ్రీ నెంబరు) నినాదంతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ ర్యాలీలో ఆర్డీవో కావూరి చైతన్య, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, వీఎంసీ అదనపు కమిషనర్ డీ చంద్రశేఖర్, స్వచ్ఛంద సంస్థలు, యోగా శిక్షణ సంస్థలు, యోగా గురు సత్యనారాయణ, అధికారులు, సిబ్బంది, యోగా ఔత్సాహికులు పాల్గొన్నారు.


యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు

యోగాభ్యాసంతో ఒత్తిళ్లు దూరం

సత్యనారాయణపురం: రోజువారీ జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్లను ఎదుర్కొనేందుకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బీఆర్‌టీఎస్ రోడ్డు యోగా స్ట్రీట్‌లో జిల్లా అధికారులు, వీఎంసీ, సోమవారం టీచర్స్ థీమ్ యోగా జరిగింది. ఉపాధ్యాయులతో కలిసి కలెక్టర్ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యోగాంధ్రకు విశేష స్పందన వస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ రోజులో కొంత సమయాన్ని యోగా, ధ్యానానికి కేటాయించి సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవాలన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు కే ధనలక్ష్మి, టీ రాజేశ్వరి, నర్సింగ్ కాలేజీ ఉపాధ్యాయురాలు ఎం మాధవి, డాక్టర్ కొల్లేటి రమేష్, వీఎంసీ పాఠశాలల ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు గ్రేడ్-1

అదనపు పీపీగా ఎంకే విజయలక్ష్మి

నెల్లూరుకు జి కల్యాణి, విజయవాడ 8వ ఏడీజే కోర్టుకు ఆర్ జగదీష్

విజయవాడ లీగల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా బదిలీలకు చివరిరోజు కావడంతో వివిధ జిల్లాల కోర్టుల్లో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా పనిచేస్తున్న పలువురిని పలు జిల్లా కోర్టులకు అదనపు పీపీలుగా బదిలీ చేస్తూ హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజిత్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. గ్రేడ్-1 అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా పనిచేస్తున్న జి.కల్యాణి (విజయవాడ 8వ అదనపు జిల్లా కోర్టు)ని నెల్లూరులోని 8వ అదనపు జిల్లా కోర్టుకు బదిలీ చేశారు. అలాగే నెల్లూరులోని 8వ అదనపు జిల్లా కోర్టులో గ్రేడ్-1 అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న ఎంకే విజయలక్ష్మిని విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టుకు బదిలీ చేశారు. నెల్లూరు ఎస్సీ, ఎస్టీ కోర్టులో గ్రేడ్-1 అదనపు పీపీగా పనిచేస్తున్న ఆర్ జగదీష్‌ను విజయవాడ 8వ అదనపు జిల్లా కోర్టుకు బదిలీ చేస్తూ కుమార్ విశ్వజిత్ ఆదేశాలు జారీ చేశారు.



ఉత్సాహంగా సౌత్‌జోన్ మహిళల క్రికెట్

● ఐదు జిల్లాల క్రీడాకారిణుల హాజరు

నెల్లూరు (విద్య), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుజబుజనెల్లూరులోని సీఏపీ క్రీడామైదానంలో సోమవారం అండర్-15 మహిళల ఏసీఏ సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాలకు చెందిన క్రికెట్ క్రీడాకారిణిలు ఈ పోటీలకు హాజరయ్యారు. వారంపాటు పోటీలను నిర్వహించనున్నారు. తొలిరోజు పోటీల్లో చిత్తూరు, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు నిర్ణీత 25 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 288 పరుగులు సాధించింది. ఈ జట్టులోని ఈ.గేయకీర్తి 120 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 24.3 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 118 పరుగులకే ఆలౌట్ కావడంతో చిత్తూరు జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో అనంతపురం, కర్నూలు జట్లు తలపడగా, టాస్‌గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం జట్టు 16 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 78 పరుగులు మాత్రమే సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 21.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 81 పరుగులతో విజయం సాధించింది. తొలిరోజు ఈ పోటీలను ఎన్‌డీసీఏ అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, కార్యదర్శి కే.శ్రీనివాసులరెడ్డి, జనరల్ మేనేజర్ పీ. భాను ప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర జూనియర్ సెలక్షన్ కమిటీ సభ్యులు బీ.లీలామోహన్‌రెడ్డి, ఏసీఏ అంపైర్స్ పవన్‌కిషోర్, త్రినాథ్ పర్యవేక్షించారు.

నియోజకవర్గాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

● రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్

కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047 దార్శనిక ప్రణాళికకు అనుగుణంగా నియోజకవర్గాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి నియోజకవర్గ దార్శనిక కార్యాచరణ ప్రణాళిక యూనిట్లు (సీవీఏపీయూలు) ప్రారంభించారని, ఇది నియోజకవర్గాల అభివృద్ధిలో కీలక మైలురాయి అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. సోమవారం సచివాలయం నుంచి రాష్ట్రంలోని 26 జిల్లాలు, 175 నియోజకవర్గాల్లో విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాలను సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఇలక్కియ హాజరయ్యారు. అనంతరం మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ కార్యాచరణ ప్రణాళిక యూనిట్‌కు స్థానిక ఎమ్మెల్యే చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారని, ప్రత్యేక అధికారి ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారన్నారు. ఆరోగ్యం, విద్య, జీవనప్రమాణాల్లో అత్యుత్తమ ప్రమాణాలను సాధించడంతో పాటు ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, పౌర కేంద్రీకృత సేవల పంపిణీ, యువత, మహిళా సాధికారత సాధన లక్ష్యంగా దార్శనిక ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. ప్రజా భాగస్వామ్యంతో లక్ష్యాల సాధనకు సమిష్టిగా కృషిచేయనున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. కార్యక్రమంలో సీపీఓ వై.శ్రీలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

అర్జీల పరిష్కారంలో నాణ్యతకు ప్రాధాన్యం

● జాయింట్ కలెక్టర్ ఇలక్కియా

కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అర్జీలు పునరావృతం కాకుండా నాణ్యతతో దరఖాస్తు దారుడు సంతృప్తి చెందేలా అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియా అన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జేసీ ఇలక్కియా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వీకరించిన అర్జీలకు సంబంధించి కిందిస్థాయి అధికారులు సిబ్బంది నుంచి స్పష్టమైన సమాచారం తీసుకొని, పునరావృతం కాకుండా సమస్యలను పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరచడమే లక్ష్యంగా పనిచేసి ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)పై ప్రజలు అనేక ఆశలు పెట్టుకుంటారన్నారు. సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారం లభిస్తుందనే ఆశతో ప్రజలు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి తాము ఎదుర్కొంటున్న సమస్యలపై అర్జీలను సమర్పిస్తున్నారని జేసీ తెలిపారు. అర్జీల స్వీకరణలో డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.


ప్రజా సమస్యలను వింటున్న జేసీ ఇలక్కియా

లీజు పేరుతో దుకాణాల కబ్జా..!

● బాధితులను బెదిరిస్తున్న వైసీపీ నేత, మాజీ మంత్రి అనుచరులు
● పోలీసులను ఆశ్రయించిన బాధితులు
● వారి సమక్షంలోనూ బెదిరింపులు

వన్‌టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారస్థులకు మాయమాటలు చెప్పి లీజు పేరుతో మూడు దుకాణాలు తీసుకున్న వైసీపీ నేత, మాజీ మంత్రి అనుచరులు చిరు వ్యాపారస్థులను బెదిరిస్తున్నారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. తర్వాత వారి సమక్షంలోనూ వైసీపీ నేతలు బరితెగించి బెదిరింపులకు పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే కండ్రికకు చెందిన ఎస్ శివ, ఎస్ సోమయ్య, కొత్తపేటకు చెందిన కే శ్రీనివాసరావుకు సుమారు 40 ఏళ్ల నుంచి గవర్నర్‌పేట లెనిన్ సెంటర్ కాలువ ఒడ్డున 27, 28, 29 షాపుల్లో వస్త్ర వ్యాపారం చేస్తున్నారు. వీరంతా చిరు వ్యాపారులే. కృష్ణలంక సత్యంగారి హోటల్ సమీపంలోని మాజీ మంత్రి, వైసీపీ నేత ముఖ్య అనుచరులు నారంశెట్టి చిరంజీవి, అతడి తమ్ముడు ఈశ్వరరావు 2015లో ఒక్కోషాపునకు ప్రతినెలా రూ. 16వేలు అద్దె చెల్లిస్తామని ఒప్పందం చేసుకున్నారు. 2017 వరకు బాగానే చెల్లించారు. తరువాత నుంచి చెల్లించకపోవటంతో అద్దె గురించి అడగ్గా, తాము అంత చెల్లించలేమని కోర్టుకు వెళ్లారు. అక్కడ కూడా చెల్లించలేదు. 2021లో పలువురు పెద్దల సమక్షంలో పాత బకాయిలు చెల్లించలేము, ఇప్పటి నుంచి ప్రతి నెలా అద్దె చెల్లిస్తామని ఒప్పుకొన్నారు. అయినా చెల్లించటం లేదు. అద్దె గురించి అడుగుతుంటే తాము అధికారంలో ఉన్నామని, మంత్రి అండదండలున్నాయని బెదిరించారు. గత ఏడాది ఫిబ్రవరి 19న బాధితులు స్పందనలో సీపీకి ఫిర్యాదు చేయగా, ఎన్నికల సమయం కావటంతో రేపు మాపు అంటూ కాలయాపన చేశారు. దీంతో బాధితులు కోర్టును ఆశ్రయించారు. ప్రతి వాయిదాకు బాధితులు హాజరవుతున్నా చిరంజీవి, అతడి సోదరుడు హాజరవ్వటం లేదని బాధితులు చెబుతున్నారు. వారం క్రితం బాధిత కుటుంబాలు తమ షాపుల వద్దకు వెళ్లి మూడు షాపులను స్వాధీనం చేసుకుని, తాళాలు వేసుకున్నారు. మరుసటి రోజు వారు షాపుల తాళాలు పగులకొట్టి షాపులోకి వెళ్లారు. బాధితులు గవర్నరుపేట పోలీసుల వద్దకు అక్కడికి వెళ్లగా వారిపైనా వీరంగం చేసి పెట్రోల్ పోసుకుని చచ్చిపోతామంటూ బెదిరించాడు. మూడు షాపుల్లో తమ అనుచరులను పెట్టి బాధితులను వెళ్లనీయకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు కనీసం తమకు తెలియపరచకుండా షాపుల మధ్య గోడలు పగులకొట్టి పనులు చేయించారని బాధితులు శివ, సోమయ్య, శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.


బాధితులు శివ, సోమయ్య, శ్రీనివాసరావు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	116, 125, 136
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230



సెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

మద్యం మత్తులో ఒకరిపై దాడి

గుడివాడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి మాటమాట పెరిగి ఒకరిపై ముగ్గురు దాడిచేసిన ఘటన గుడివాడలో చోటు చేసుకుంది. స్థానిక శ్రీరామపురానికి చెందిన గంటా రామకృష్ణ ఈ నెల 8వ తేదీ రాత్రి మద్యం సేవిద్దామని స్నేహితుడు వెంకీని వెంటతీసుకుని స్థానిక మార్కెట్ సెంటర్‌కు వచ్చాడు. మద్యం సేవించి, మరో ఇద్దరు బత్తుల కోటేశ్వరరావు, చెన్నూరి సాయికృష్ణలను పిలిపించారు. తరువాత రామకృష్ణ, సాయికృష్ణల మధ్య మాట మాట పెరిగి కొట్లాటకు దారితీసింది. రామకృష్ణపై రాయి, చేతులతో వెంకి, కోటేశ్వరరావు, సాయికృష్ణలు దాడి చేశాడు, గాయాలపాలైన రామకృష్ణను అతని భార్య సుకన్య చికిత్స నిమిత్తం స్థానిక ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రామకృష్ణ భార్య సుకన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ రైటర్ ఆర్.కిషోర్ తెలిపారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న గౌడ సంఘీయులు

లుక్కా కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం

గుడివాడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బైపాస్‌రోడ్డులో నివాసముంటున్న లుక్కా రామదాసు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, ఆయన కుటుంబానికి గుడివాడ గౌడ సంఘీయులు అండగా నిలిచారు. సోమవారం లుక్కా కుటుంబసభ్యులకు గౌడ సంఘం నాయకులు యార్లగడ్డ గోవర్ధనరావు ఆధ్వర్యంలో గుడివాడ గౌడ సంక్షేమ సంఘం తరుపున రూ.63,816లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు బడుగువెంకటేశ్వరరావు, శొంఠి నాగేశ్వరరావు, యార్లగడ్డ సుధారాణి, పోలగాని కృష్ణయ్య, రాజులపాటి మంగరాజు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ఈడే శ్రీనివాసరావు, జోగి సోములు గూడవల్లి వెంకటేశ్వరరావు, యార్లగడ్డ మురళీకృష్ణ, పరసా శశి, చింతా చంద్ర, నారగాని శ్రీనివాసరావు, ఎల్లయ్య, బొల్లా హరి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

పెదపారుపూడి : మూడు సంవత్సరాలు నిండిన పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూపర్‌వైజర్ అరుణ కుమారి తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన పెదపారుపూడి సెంటర్-1లో 'మన అంగన్వాడీ పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆట, పాటలతో విద్యను అనభ్యసింప చేస్తున్నామన్నారు.పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ టీచర్లు రజని కుమారి, భవాని, సుశీల పాల్గొన్నారు.

పేదరిక రహిత సమాజ నిర్మాణమే ధ్యేయం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజం నిర్మాణమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పీ4లో సేవా తత్పరులు, పారిశ్రామిక వేత్తలు భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. గుడివాడ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన గుడివాడ నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌ను సీఎం చంద్రబాబు సోమవారం మధ్యాహ్నం వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం సీఎం చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే రాము , అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదరిక నిర్మూలనకు పీ4 ద్వారా చేయనున్న కార్యక్రమాలను సీఎం చంద్రబాబు వివరించారు. అనంతరం అధికారులు పీ4 సభ్యులతో ఎమ్మెల్యే సమావేశం అయ్యారు. నియోజకవర్గ అభివృద్ధి, పరిశ్రమల స్థాపన, సమాజ వనరులపై దృష్టి, పేదరిక నిర్మూలనకు చేయనున్న కార్యక్రమాలపై సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గుడివాడ నియోజకవర్గంలో పీ4 సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. నియోజకవర్గంలోని బంగారు కుటుంబాల గుర్తింపుతోపాటుగా పీ4లో స్వచ్ఛందంగా భాగస్వామ్యం అవ్వాలనుకునే ఎన్ఆర్ఐలు, పారిశ్రామిక వేత్తలు , ఔత్సాహికులను గుర్తించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో మార్పు తెచ్చేందుకు పీ4 విధానం తీసుకొచ్చామన్నారు. పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్‌తో పీ4 విధానాన్ని తీసుకొచ్చిన సీఎం చంద్రబాబు ఆలోచన ఎంతో గొప్పదన్నారు. పీ4 అందించే సత్ఫలితాలు ఎందరో కుటుంబాల్లో వెలుగులు నింపాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఎంపీడీవో విష్ణు ప్రసాద్, రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు వాసే మురళీ, పి4 సభ్యులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

టిడ్కో కాలనీలో రేషన్ షాపు ఏర్పాటు చేయాలి

గుడివాడ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గుడివాడ టిడ్కో కాలనీలో రేషన్ షాపులు ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు మాచర్ల రామకృష్ణ తహసీల్దార్ రామకోటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. సోమవారం మీ కోసం సందర్భంగా రామకృష్ణ టిడ్కో కాలనీలో రేషన్‌కు రావాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గుడివాడలోని రేషన్ షాపులకు వచ్చి రేషన్ తీసుకునేందుకు ఒక్కొక్కరికి రూ.200ల ఖర్చు అవుతుందని తెలిపారు. ప్రతి నెలా గుడివాడ రావాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. రెవెన్యూ అధికారులు స్పందించి వెంటనే టిడ్కో కాలనీలో రేషన్ డిపోలు ఏర్పాటు చేయాలని తెలిపారు. తహసీల్దార్ స్పందించి పరిశీలిస్తామని తెలిపారు. టిడ్కో కాలనీ వాసులకు ఏయే ప్రాంతాల్లో రేషన్ కార్డులు ఉన్నాయి. తదితర అంశాలను పరిశీలించి వారు ఉన్న ప్రాంతాల్లో ఈ రేషన్ కార్డులను టిడ్కో కాలనీకి బదిలీ చేయాల్సి ఉంటుందని తెలిపారు. రెవెన్యూ సిబ్బందితో సర్వే చేయించి వారి సమస్య పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఖరీఫ్ సాగుకు అన్నదాతలు సమాయత్తం

తోట్లవల్లూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : గడచిన మే నెలలో అకాల వర్షాలు కురవటం ఖరీఫ్ సాగుకు ఊతమిచ్చినట్టయింది. వరిసాగు చేసే రైతులు మాగాణి పొలాలను ట్రాక్టర్లతో దుక్కి దున్నించేందుకు వర్షం అనువుగా మారిందని రైతులు చెబుతున్నారు. మండలంలోని 16 గ్రామాల్లో రైతన్నలు ట్రాక్టర్లతో మాగాణి పొలాల్లో దుక్కిలు దున్నటం, నారుమడులు పోయటంలో బిజీగా ఉన్నారు. వ్యవసాయశాఖ ద్వారా 10 టన్నుల వరి విత్తనాలను పంపిణీ చేయటంతో నారుమడులకు ఉపయుక్తంగా మారింది. ఈ విత్తనాలు లభించని రైతులు బయటి మార్కెట్లో కొనుగోలు చేసి నారుమడులు పోసుకుంటున్నారు. రోహిణికార్తె ముగిసి మృగశిరకార్తె ప్రవేశించటంతో వర్షాలు కురుస్తాయని రైతులు ఎదురు చూస్తున్నారు. మండలంలో కేఈబీ కెనాల్, బందరు కాలువ, పుల్లేటి కాలువలు ఉండటంతో ఆ కాలువల కింద, మోటార్ల ద్వారా సాగునీరు లభ్యమైతే రైతులు సకాలంలో వరినాట్లు వేసుకునే వెసులుబాటు ఉంది. కాగా మండలంలో ఈ ఖరీఫ్‌లో సుమారు 8,500 ఎకరాల వరకు వరి సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.



తోట్లవల్లూరులో నారుమడులు పోస్తున్న రైతులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఐసీడీఎస్ అధికారిణి సి.భానుశ్రీ

పామర్రు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, చిన్నారులు సద్వినియోగం చేసుకుని తమ మూడేళ్ల లోపు చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని పామర్రు ఐసీడీఎస్ అధికారిణి సి.భానుశ్రీ పిలుపునిచ్చారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పామర్రు, కురుమద్దాలి, కనుమూరు, తదితర గ్రామాల్లో అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి సోమవారం అంగన్వాడీపై ప్రజలకు అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటినుంచి ఈ నెల 24 వరకు అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలతో పాటు అంగన్వాడీ చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు ర్యాలీ ద్వారా వివరించారు. సెక్టార్ పర్యవేక్షకురాలు నూతక్కి సత్యశ్రీ, ఎన్. విజయకుమారిలు పూర్వప్రాథమిక విద్య ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. దీంతోపాటుగా అంగన్వాడీ ద్వారా పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల, మేధాశక్తి అభివృద్ధిపై తల్లులకు వివరించారు. అంగన్వాడీ నిర్వాహకులు ఆర్. ప్రేమ్‌కిరణ్, పి.వెంకటలక్ష్మి, కె.రత్నశ్రీ, బి.పద్మజారాణి, పి.పుష్పా, కె.ప్రసన్న, నాగమల్లేశ్వరమ్మ,పాల్గొన్నారు.



అంగన్వాడీలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న భానుశ్రీ

వ్యవసాయంలో డ్రోన్ల ఆవశ్యకతపై అవగాహన

కూచిపూడి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో డ్రోన్ల ఆవశ్యకత పెరిగిందని తద్వారా రైతులకు సమయం, డబ్బు ఆదా అవుతుందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రేవతి తెలిపారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కోసూరులో వికసత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించి పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తనశుద్ధి, యాజమాన్య పద్ధతులు పాటించినట్లైతే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అధిక మోతాదులో రసాయనిక మందుల వాడకం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదన్నారు. మొవ్వ సబ్ డివిజన్ ఏడీఏ శ్యామల రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. భూసార పరీక్షల ప్రాముఖ్యతను ఏవో శివప్రసాద్ వివరించారు. డాక్టర్ పద్మావతి, ఉద్యాన అధికారిణి కీర్తి పలు విషయాలపై అవగాహన కల్పించారు.



డ్రోన్ల ఉపయోగాలు వివరిస్తున్న శాస్త్రవేత్తలు

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

గుడ్లవల్లేరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : కోల్పోయిన స్నేహితుడి జ్ఞాపకాలను పదిలపరుచుకునేందుకు మిత్రుడి పేరిట క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటుచేయడం అభినందనీయమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. అంగలూరులో కొమ్ములపాటి సాయి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ సోమవారంతో ముగిసింది. బహుమతి ప్రధాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీర ధృడత్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. విజయం సాధించిన అంగలూరు జట్టును, రన్నరప్‌గా నిలిచిన చంద్రాల జట్టును ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, కొడాలి రామరాజు, ఎ.రామ్మోహనరావు, బొర్రా ధనకోటేశ్వరరావు, మేకా వెంకటేశ్వరరావు, అట్లూరి స్వరూప్, గ్రామ సర్పంచ్ రవికుమార్, అనగాని నాగేంద్రబాబు, అనగాని లీలా, బండి శ్రీకాంత్, చేబ్రోలు నాగార్జున, బుజ్జిబాబు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీ అందచేసిన ఎమ్మెల్యే రాము

స్మార్ట్ మీటర్లను పగులకొట్టిన వారిపై కేసు నమోదు

గుడివాడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నైజాంపేటలో స్మార్ట్‌మీటర్లను బిగించేందుకు వచ్చిన వారిని అడ్డుకుని స్మార్ట్‌మీటర్లను పగులకొట్టిన సీపీఎం నాయకులు బి.వి శ్రీనివాసరావుపై విద్యుత్ శాఖ ఏఈ ఉష ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఏఎస్సై వీరంకి గోవర్ధనరావు తెలిపారు.



సమావేశములో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామరాజు

అధికారుల గైర్హాజరుపై చర్యలు తీసుకుంటాం : ఎంపీడీవో

పమిడిముక్కల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండల సమావేశానికి హాజరుకాని వివిధశాఖల అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. మండల కార్యాలయంలో ఎంపీపీ కె.వేద సుప్రజ అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల సమావేశానికి అన్ని శాఖల అధికారులందరూ ఎందుకు హాజరుకారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వేల్పూరు ఊర చెరువులో అక్రమంగా మట్టి తవ్వకం జరుగుతుందని వచ్చిన సమాచారం మేర తవ్వకాలు నిలిపి వేయించామని ఎంపీడీవో సభ్యులకు తెలియజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వై.వెంకటరమణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు చోరీ

గుడివాడ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): దొండపాడు దేవాలయంలో సోమవారం బంగారపు గొలుసు చోరీ అయిందని ఓ వ్యక్తి కేసు పెట్టినట్టు రూరల్ ఎస్సై చంటిబాబు సోమవారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవరోధాలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా గుడివాడ టిడ్కో కాలనీ నుంచి కౌతవరం సబ్‌స్టేషన్ వరకూ రూ.2.20 కోట్ల నిధులతో 33 కేవీ విద్యుత్ లేన్ ఏర్పాటు చేశామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం కౌతవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 33 కేవీ విద్యుత్ లైన్ బ్రేకర్ స్విచ్ ఆన్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా ఉండేందుకు విద్యుత్‌శాఖ అధికారులతో పలు దశలుగా సమీక్షలు నిర్వహించి రూ.4కోట్లతో పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. విద్యుత్‌శాఖ మంత్రితో మాట్లాడి నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు లేకుండా చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఏఎంసీ ఛైర్మన్ పొట్లూరి రవికుమార్, డీసీ ఛైర్మన్‌లు మల్లిపెద్ది సుబ్రహ్మణ్యేశ్వర చౌదరి, పాలేటి ఆంజనేయులు, కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ వి.బి.కె.వి సుబ్బారావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని వెంకట్రావు, జనసేన జిల్లా కార్యదర్శి పేర్ని జగన్, వెణుతురుమిల్లి సర్పంచ్ కె.శేషవేణి, ఎ.రామ్మోహనరావు, కొడాలి రామరాజు, తూము సుబ్బారావు, గరికపాటి రాంబాబు, యెనిగళ్ల నాగేశ్వరరావు, రంగబాబు, వీరమాచనేని శివప్రసాద్ విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఆర్థిక సాయం

గుడివాడ రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అనారోగ్య కారణంతో మృతి చెందిన వడ్రంగి మేస్త్రీ షరీఫ్‌బేగ్ కుటుంబానికి ది గుడివాడ ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అండగా నిలిచారు. సోమవారం మల్లాయిపాలెంలోని ఆయన ఇంటికివెళ్లి ఆయన కుమారుడు ఇలియాస్‌బేగ్‌కు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు తమ్మిశెట్టి లక్ష్మణరావు, అధ్యక్షకార్యదర్శులు అబ్దుల్ హమీద్, అబ్దుల్ ఖుద్దూస్, నాయకులు ఆంజనేయులు, నాగరాజు, మొహిద్దీన్ భాషా, శ్యామ్‌కుమార్, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ వైద్యుడు సూరపనేని మృతి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ, పెదపారుపూడి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వైద్యులు, ప్రముఖ విద్యాసంస్థలైన ఏఎస్ఆర్, వీకెఆర్ అండ్ వీఎన్‌బీ పాలిటెక్నిక్, కేటీఆర్ కళాశాలల సభ్యులు డాక్టర్ సూరపనేని బలరామకృష్ణయ్య(95) హైదరాబాదులో మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని గుడివాడ రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగృహంలో సోమవారం సందర్శనార్థం ఉంచారు. డాక్టర్ బలరామకృష్ణయ్య భౌతికకాయానికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నివాళులర్పించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, అర్బన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ పిన్నమనేని బాబ్జీ, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు తదితరులు సంతాపం తెలిపారు. భూషణగుళ్ల గ్రామం నుంచి పామర్రు అసెంబ్లీ టీడీపీ కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, నీటి సంఘం అధ్యక్షుడు నవీన్ చౌదరి, మాజీ నీటి సంఘ అధ్యక్షుడు రమణ, రాజా, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

గుడివాడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మానవతా స్వచ్ఛంధ సంస్థ సభ్యులునిమ్మగడ్డ రమేష్ తల్లి లక్ష్మీకాంతమ్మ జ్ఞాపకార్థం స్థానిక కొత్త మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్ వేణుగోపాలరావు, అన్నపురెడ్డి గోపిరెడ్డి, సీతారామస్వామి, బ్రహ్మయ్య, రాధాకృష్ణ, చిన్నం గంగాధరరావు, రామకృష్ణ, మోహనరావు, రమేష్, ఆయన కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఏడుగురికి షైనింగ్ స్టార్ అవార్డులు



ప్రతిభా అవార్డు అందుకున్న మొవ్వ జడ్పీ పాఠశాల విద్యార్థిని కూతాడి వైశాలి

కూచిపూడి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన మొవ్వ మండలానికి చెందిన ఏడుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్స్ 2025 ప్రతిభా అవార్డులకు ఎంపికై కృష్ణా జిల్లా కలెక్టర్ డికె.బాలాజీ చేతులమీదుగా అవార్డులు అందుకున్నారు. వీరికి మచిలీపట్నం జడ్పీ కన్వెన్షన్ హాలులో కలెక్టర్‌తోపాటు జేసీ గీతాంజలి శర్మ, ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు, డీఈవో రామారావు తదితర అధికారుల సమక్షంలో జరిగిన అభినందన సభలో రూ.20వేల నగదు, ప్రశంసాపత్రం, మెమొంటో అందజేశారు. విద్యార్థులు తిరుమలశెట్టి లిఖిత సాయి, లాస్య సాయి, అన్విత జాయ్, తేజస్విని, మహాశివరాణి, వెంకట సాయి యశ్వంత్, వైశాలిలు అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు.

పమిడిముక్కల: పదో తరగతి పరీక్షల్లో 500 మార్కులకు పైగా సాధించిన 7మంది విద్యార్థులకు ప్రభుత్వం నుంచి షైనింగ్ స్టార్ అవార్డులు లభించాయి. మచిలీపట్నంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ గంగాధరరావు ఇతర అధికారుల నుంచి రూ. 20వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఎంకే ఇంగ్లీషు మీడియం స్కూల్ కె చెందిన శ్రీరామ్‌శిరీష, జీసస్ హైస్కూల్ చెందిన జువారి ఫిరోజ్, జి.దుర్గాప్రకాశ్, కె.యామిని, ఎం. చరితశ్రీ, పి.వినీత, ఎం.వెంకట్ కౌశిక్ అవార్డులు అందుకున్నారు.



ప్రతిభా అవార్డు అందుకుంటున్న ఎంకే స్కూల్ విద్యార్థిని శ్రీరామ్‌శిరీష

గుడ్లవల్లేరు : పదో తరగతిలో టాపర్స్ నిలిచిన విద్యార్థులకు ప్రకటించిన షైనింగ్- 2025 అవార్డులు ఎ.ఎ.ఎన్ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ గుడ్లవల్లేరు ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు 5గురు అవార్డులను అందుకొన్నారు. మండల టాపర్స్‌గా నిలిచిన వత్తుమిల్లి తరుణ్ 579 మార్కులు, పామర్తి శివనాగేశ్వరరావు 575 మార్కులు, పెనుమూడి జయశ్రీ 575 మార్కులు, లిఖితశ్రీ 571, ఎస్.తరుణ్ తేజ 559 మార్కులు సాధించగా వీరికి షైనింగ్ అవార్డులను జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ చేతులమీదుగా అవార్డులను, ఒక్కొక్కరికీ రూ 20వేల నగదును అందుకొన్నారన్నారు. విజేతలను యాజమాన్యం అభినందించారు.



ప్రతిభా అవార్డు అందుకుంటున్న గుడ్లవల్లేరు ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	116, 125, 136
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

పెడన కమిషనర్ గోపాలరావు బదిలీ

పెడన, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : పెడన మునిసిపల్ కమిషనర్ మన్నం గోపాలరావు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనను మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించింది. నెల్లూరు కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎల్. చంద్రశేఖరరెడ్డిని పదోన్నతిపై పెడన మునిసిపల్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

ఉపాధి శ్రామికుడు మృతి

గూడూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : కంకటావ గ్రామంలో ఉపాధి పనులకు వెళ్లిన కె. సీతారామయ్య (58) సోమవారం పంట బోదె తవ్వుతుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు...రూ.6.27లక్షల జరిమానా

ఘంటసాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు జనరల్ మేనేజర్ విజయకృష్ణ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. కొడాలిలోని ప్రసన్నాంజనేయ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను అధికారులు వెల్లడించారు. 50 మంది అధికారులు 32 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (విజిలెన్స్) సిహెచ్.వాసు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.కృష్ణ నాయక్ తెలిపారు. అనుమతించిన కేటగిరీలో కాకుండా ఇతర కేటగిరీల్లో విద్యుత్ వాడుకుంటున్న ఆరుగురిని గుర్తించి, రూ.9400 జరిమానా విధించటం జరిగిందన్నారు. అదనపు లోడు వాడుతున్న 229 మందిని గుర్తించి, రూ.6,18,000 జరిమానా విధించామన్నారు. చల్లపల్లి డీఈఈ పులి శివ నాగేశ్వరరావు, అవనిగడ్డ డీఈఈ ఎన్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఘంటసాల ఏఈ పి.రవికుమార్, ఏఈలు, లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.


బొబ్బా గోవర్ధన్‌ను సత్కరిస్తున్న కనపర్తి, టీడీపీ నేతలు

గోవర్ధన్ సేవలు అభినందనీయం

అవనిగడ్డ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ బలోపేతానికి బొబ్బా గోవర్ధన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. బొబ్బా గోవర్ధన్‌ను పార్టీ నేతలు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా సత్కరించారు. కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలు పార్టీకి గోవర్ధన్ అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహానాడు తరలివెళ్లిన ప్రతి కార్యకర్తను స్వయంగా కలసి వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. కోడూరు మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, రావి రత్నగిరి, మండలి రామ్మోహనరావు, బండే రాఘవ, మోర్ల జయలక్ష్మి, పైడిపాముల స్వప్న, బావిశెట్టి కనకదుర్గ, కనగాల రాధ, నారాయణమ్మ, పరుచూరి దుర్గా ప్రసాద్, షేక్ బాబావలి, మొగావత్తు గోపి, మేడికొండ విజయ్, ఘంటసాల రాజమోహనరావు, అప్పికట్ల రవీంద్రబాబు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, గోగినేని బుజ్జి, పిల్లి మల్లికార్జునరావు, బాలకోటేశ్వరరావు, కోట సాయి, బచ్చు రమణ, పూతబోయిన శ్రీనివాసరావు, తోట సూర్యం తదితరులు పాల్గొన్నారు.

మసులా బీచ్ ఫెస్టివల్ విజయవంతం

ఓర్వలేని వైసీపీ నేతలు : గోపీచంద్

మచిలీపట్నం టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మసులా బీచ్ ఫెస్టివల్ విజయవంతం అయ్యిందని, దానిని చూసి వైసీపీ నాయకులు ఓర్వలేక అవాకులూ చవాకులూ పేలుతున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ విమర్శించారు. టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిగా పర్యాటకులు వచ్చారని, మునుపెన్నడూ జరగని విధంగా జలక్రీడలు నిర్వహించారన్నారు. ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ డి.కె. బాలాజీ, ఎస్పీ గంగాధరరావు ఎంతో బాధ్యతగా నిర్వహించారన్నారు. తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ మాట్లాడుతూ, బీచ్ అభివృద్ధికి మంగినపూడి బీచ్ ఫెస్టివల్ దోహదపడుతుందన్నారు. మచిలీపట్నం నగర టీడీపీ అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి బచ్చుల అనిల్‌కుమార్, టీడీపీ బందరు మండల కార్యదర్శి కాటం మధుసూదనరావు, టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పి.వి. ఫణికుమార్, గుమ్మడి విద్యాసాగర్, బురకా బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

చల్లపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు, కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి పెట్టుబడి సాయం అందించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుత్తికొండ రామారావు డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర నాయకత్వం పిలుపులో భాగంగా రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి సోమవారం చల్లపల్లి తహసీల్దార్ డి.వనజాక్షికి వినతిపత్రం అందజేశారు. సాగు ఖర్చులను దృష్టిలో ఉంచుకుని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి రూ.5 లక్షల వర టకు పంట రుణాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఇండియా నిబంధనల ప్రకారం రూ.రెండు లక్షల వరకు ఎలాంటి హామీలేకుండా కౌలు రైతులకు పంట రుణాలు అందించాలని కోరారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, రైతుసంఘం నియోజకవర్గ అధ్యక్షులు వేమూరి రత్నగిరిరావు, నక్కా శ్రీనివాసరావు, పెనుమత్స ప్రభాకరరావు, కె.రాధా, సిద్ధాబత్తుల వాసు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి సామాజిక తనిఖీ సమర్థంగా నిర్వహించండి

మోపిదేవి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీని సమర్థంగా నిర్వహించాలని ఎస్ఆర్పీ బి. సూర్యచక్ర ఆదేశించారు. మండలంలోని గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీకి సంబంధించి వివిధ శాఖల ఉద్యోగులతో సమన్వయ సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఈ నెల 10 నుంచి 19వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహించాలన్నారు. 19వ తేదీన మండల స్థాయిలో మోపిదేవిలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏ విధమైన ప్రలోభాలకు లోను కాకుండా తనిఖీ నిర్వహించాలని తెలిపారు. ఏపీడీ రామ్మోహనరావు, ఏపీవో ముత్యాలు, ఈవోపీఆర్డీ కె.టి.సుందరి తదితరులు పాల్గొన్నారు.



సత్రం సెంటర్ రహదారికి మరమ్మతులు

ఘంటసాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల సత్రం సెంటర్ నుంచి మల్లంపల్లి వెళ్లే రోడ్డులో రైసుమిల్లు వరకు గోతులు పడి ప్రయాణించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ, మండల పరిషత్ నిధులు రూ.2 లక్షల అం చనాలతో రహదారికి తాత్కాలిక మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. సోమవారం ఎక్స్‌కవేటర్‌తో గోతులను పూడుస్తూ పనులు చేపట్టగా, కార్యదర్శి జయలక్ష్మి పనులను పర్యవేక్షించారు.

తీర గ్రామాలకు తాగునీరు సరఫరా

నాగాయలంక, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో తీర గ్రామాల ప్రజలకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో తాగునీరు ఉచితంగా అందిస్తున్నారు. పాత ఉపకాలి, సంగమేశ్వరం గ్రామాల ప్రజలకు 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేశారు. మండలి ఫౌండేషన్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని మండలి వెంకట్రామ్ పర్యవేక్షించారు.


ర్యాలీలో పాల్గొన్న బందరు నగరపాలక సంస్థ ఉద్యోగులు


పాపవినాశనంలో యోగాపై అవగాహన ర్యాలీలో పిల్లలు, పెద్దలు


చల్లపల్లిలో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు

సంపూర్ణ ఆరోగ్యమే యోగాంధ్ర లక్ష్యం

మచిలీపట్నం టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ ఆరోగ్యమే యోగాంధ్ర లక్ష్యమని నగర పాలక సంస్థ కమిషనర్ బాపిరాజు పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయూష్ ఆధ్వర్యంలో లక్ష్మీటాకీసు సెంటర్ నుంచి జడ్పీ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ ర్యాలీని ప్రారంభించి ప్రతిజ్ఞ చేయించారు. కమిషనర్ మాట్లాడుతూ, ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా విశాఖపట్నం బీచ్‌లో లక్షలాది సాధకులు యోగా ప్రదర్శన చేస్తారని, ఇది గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో చోటు చేసుకుంటుందన్నారు. మచిలీపట్నం ప్రజలు యోగా సాధన చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఇంటర్ బోర్డు అధికారి సాల్మన్‌రాజు, నోబుల్ కళాశాల ప్రిన్సిపాల్ స్టీవెన్సన్, స్టార్ కళాశాల ప్రిన్సిపాల్ ఆదిత్య, స్టార్ స్కూల్ ప్రిన్సిపాల్ అయ్యప్ప స్వామి, మునిసిపల్ మేనేజర్ కె.ఎస్. ప్రసాద్, లేడీయాంప్తిల్, స్టార్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

పెడనలో భారీ ర్యాలీ

పెడన : యోగా ప్రాధాన్యతను తెలియచేస్తూ మునిసిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఏఎంసీ నుంచి ప్రారంభమైన ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. యోగా చేయండి - ఆరోగ్యాన్ని కాపాడుకోండి - యోగాడేలో అందరూ పాల్గొనాలని ఉద్యోగులు నినాదాలు చేశారు. కమిషనర్ మన్నం గోపాలరావు, తహసీల్దార్ కె.అనిల్‌కుమార్, ఎంపీడీవో అరుణకుమారి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, డ్వాక్రా మహిళలు, మెప్మా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘంటసాల మండలంలో..

ఘంటసాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు పంచాయతీల్లో సోమవారం యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. గ్రామపురవీధుల్లో చిన్నారులు, గ్రామ ప్రముఖులు, ఉద్యోగులు యోగా ప్రయోజనాలను ప్రజలకు తెలియజేస్తూ నినాదాలు చేశారు. ఘంటసాలపాలెం, కొత్తపల్లి, కొడాలి, పాపవినాశనం గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద యోగా శిక్షణా కార్యక్రమాలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు బోలెం అర్జునరావు, సిహెచ్.వి.ఎస్.నాగమణి, అన్వర్ షరీఫ్, గ్రామ ప్రముఖులు గొర్రెపాటి సురేష్, దోనె వెంకటేశ్వరరావు తదిరతులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** మండల కేంద్రమైన చల్లపల్లిలో సోమవారం యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ యోగా ప్రాధాన్యతను తెలుసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు సూచించారు. వైస్ఎంపీపీ మోర్ల రాంబాబు, ఎంపీడీవో ఎ.వి.రమణ, ఎంపీటీసీ సభ్యురాలు పైడిపాముల స్వప్న, షేక్ నబీషోరి, కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావు, డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధి కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. **మోపిదేవి :** యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మండల పరిషత్ ఆధ్వర్యంలో వివిధ శాఖల ఉద్యోగులు యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ రావి దుర్గావాణి ర్యాలీని ప్రారంభించగా, ప్రధాన రహదారి నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగించారు. మోపిదేవి ప్రధాన కూడలిలో యోగా సాధనపై కలిగే ప్రయో జనాలనుతెలియజేశారు. మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షకులు పాండురంగారావు, పశువైద్యాధికారి డాక్టర్ నంద కిషోర్, ఉద్యోగులు ర్యాలీలో పాల్గొన్నారు.


ఘంటసాలపాలెంలో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు


మోపిదేవిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు


విజయక్రాంతి విద్యార్థినులను అభినందిస్తున్న ఎస్పీ గంగాధరరావు


అవార్డులు అందుకుంటున్న నాగలలిత, శ్రీలక్ష్మిసుమ

చల్లపల్లి, పెడన విద్యార్థినులకు ప్రతిభా అవార్డులు

చల్లపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలువురు విద్యార్థినిలు రాష్ట్ర ప్రభుత్వ షైనింగ్ స్టార్ ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారు. విజయ క్రాంతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం సీఈసీలో అత్యధిక మార్కులు సాధించిన మట్టా శ్రీవల్లి, పొట్లూరి త్రివేణి, కాగిత భార్గవి మచిలీపట్నంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ డీకే బాలాజీ చేతులమీదుగా అవార్డులు అందుకున్నట్లు కరస్పాండెంట్ దుట్టా శివరామప్రసాద్ తెలిపారు. విజయా అకాడమీలో పదవ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులు బళ్లా బేబీ నాగ సాయి కీర్తన, బాణావత్తుల నిత్య ప్రతిభా పురస్కారాలు పొందినట్లు ప్రిన్సిపాల్ నాగళ్ల బీమారావు తెలిపారు. విద్యార్థినులను ఎస్పీ ఆర్.గంగాధరరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ అభినందించారు. **పెడన :** విశ్వభారతి హైస్కూల్ విద్యార్థినులు కేదారి శ్రీలక్ష్మి సుమ, ఉమ్మిటి నాగలలిత షైనింగ్ స్టార్స్ అవార్డులు అందుకున్నారు. సోమవారం మచిలీపట్నంలో జరిగిన జిల్లా స్థాయి కార్యక్రమంలో కలెక్టర్ డి.కె. బాలాజీ, ఎస్పీ గంగాధరరావు, జేసీ గీతాంజలి శర్మ, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణల చేతుల మీదుగా శ్రీలక్ష్మీసుమ, నాగలలితలు షైనింగ్ స్టార్స్ అవార్డులు అందుకున్నారు. ఈ అవార్డుల కింద వీరికి రూ. 20 వేల నగదు, మెరిట్ సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వభారతి హైస్కూల్ ప్రిన్సిపాల్ అనుమకొండ గౌరీప్రసాద్ పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో వరి విత్తనాలు

పెడన రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అవసరమైన వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారిణి నూరున్నిసా తెలిపారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కావటంతో రైతులకు అవసరమైన అన్ని రకాల వరి విత్తనాలు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందని జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్ తెలిపారు. పెనుమల్లిలో వరి విత్తనాలు పంపిణీ చేశారు. శలపాటి ప్రసాద్, సమ్మెట శివరామ్‌ప్రసాద్, శీరం ప్రసాద్ రైతులు పాల్గొన్నారు.


వారణాసి సీనులో వీరబాహునిగా బోలెం రామారావు


కళాకారులను సన్మానిస్తున్న ప్రముఖులు, ఎన్టీఆర్ కళాపరిషత్ ప్రతినిధులు

ఆకట్టుకున్న సత్య హరిశ్చంద్ర ప్రదర్శన

చల్లపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ పార్కులో సోమవారం నిర్వహించిన పౌరాణిక నాటక ప్రదర్శనల్లో సత్యహరిశ్చంద్ర కళాభిమానులను విశేషంగా ఆకట్టుకుంది.

హరిశ్చంద్ర వారణాసి సీను, కాటిసీను ప్రదర్శన ఆద్యంతం ఆహూతుల కరతాళ ధ్వనులను అందుకుంది. వారణాసి సీనులో హరిశ్చంద్రునిగా గాన కోకిల గుడిపూడి గోవిందు (లెక్చరర్), చంద్రమతిగా లక్ష్మీశ్రీ, నక్షత్రకునిగా మీగడ సత్యనారాయణ, కాలకౌశికునిగా దర్శి శ్రీను, లోహితునిగా మాస్టర్ భవేష సాయి, వీరబాహునిగా ప్రముఖ రంగస్థల కళాకారుడు బోలెం రామారావు నటించారు. హరిశ్చంద్రునిగా గోవిందు, వీరబాహునిగా రామారావు అభినయం ఔరా అనిపించింది. కాటిసీనులో హరిశ్చంద్రునిగా పస్తుల విజయ్‌కుమార్ ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు. గుడివాడ రాజా, పైడేశ్వరరావు బృందం ఆర్కెస్ట్రా సహకారం అందించారు.

ఈ సందర్భంగా కళాకారులను, అతిథులను ఘనంగా సన్మానించారు. కళాపరిషత్ ప్రతినిధులు ముమ్మనేని నాని, బోలెం రామారావు, దాసి సీతారామరాజు, బోలెం నాగమణి, బి.అనంతలక్ష్మి, ఉప్పల సాంబశివరావు, బొల్లా కోటేశ్వరరావు, మునేష్‌బాబు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. చల్లపల్లి పరిసర ప్రాంత ప్రముఖులు, కళాభిమానులు, కళాపోషకులు పెద్దఎత్తున పాల్గొని నాటక ప్రదర్శనలు తిలకించారు.

కయాకింగ్, వాలీబాల్ విజేత ఆంధ్ర జట్లు

మచిలీపట్నం టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మంగినపూడి బీచ్‌లో జరిగిన జాతీయ స్థాయి కబడ్డీ, వాలీబాల్, కయాకింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు ప్రతిభను ప్రదర్శించింది. జాతీయ స్థాయి బీచ్ కబడ్డీ పురుషుల ఫైనల్స్‌లో రాజస్థాన్ జట్టుపై ఆంధ్రప్రదేశ్ జట్టు విజయంసాధించింది. మహిళల విభాగంలో హిమాచల్ ప్రదేశ్ జట్టుపై హర్యానా విజయం సాధించింది. జాతీయ స్థాయి కయాకింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. విజేతలకు డీసీఎంఎస్ చైర్మన్ రూ. 10వేల నగదు బహుమతులు అందించారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎస్పీ ఆర్. గంగాధరరావు, కయాకింగ్ రాష్ట్ర అధ్యక్షుడు దావులూరి సురేంద్రబాబు విజేతలను అభినందించారు.

శివాజీ ధైర్యసాహసాలు అందరికీ ఆదర్శం

మచిలీపట్నం టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ఛత్రపతి శివాజీ ధైర్యసాహసాలు అందరికీ ఆదర్శమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజబాబు అన్నారు. హిందూ సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా కోనేరుసెంటర్‌లో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, నవీన్, కాపవరపు చంద్రశేఖర్, నాగలింగం అయోధ్య రామయ్య, అన్నం అవినాష్, టీడీపీ నాయకులు పి.వి. ఫణికుమార్, జనసేన నాయకుడు గడ్డం రాజు తదితరులు పాల్గొన్నారు. నేతాజీ మిత్ర మండలి ఆధ్వర్యంలో చల్లరాస్తా సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గడ్డం రాజు, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, విన్నకోట సుబ్బారావు, రామకృష్ణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వైభవంగా రంగనాయక స్వామి, రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం

మచిలీపట్నం టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రంగనాయక స్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో నగరవీధుల్లో సోమవారం ఊరేగించారు. కోనేరుసెంటర్ నుంచి చల్లరస్తా సెంటర్ వరకు తెనాలికి చెందిన భజన బృందం కోలాటం అలరించింది. విష్ణుసహస్రనామ పారాయణ జరిపారు. రాబర్ట్సన్‌పేటలో పర్వత వర్ధనీ రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వా మి కల్యాణం వైభవం గా జరిగింది. ఈవో వి. సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు ఘంటసాల భాస్కరశర్మ, వేదపం డితులు కాశీనాధుని పూర్ణబాపేశ్వర శర్మ కల్యాణం నిర్వహించారు. దేసు వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు, నీరజ దంపతులు కల్యాణం నిర్వహించారు.

కోడూరులో వేంకటేశ్వరస్వామి కల్యాణం

కోడూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : కోడూరులో కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు దుంబాల శ్రీధర్ ఆధ్వర్యంలో మొవ్వ ఉషాద్రిపతి వ్యాఖ్యానంతో ఇమ్మడి వెంకట రామకృష్ణ ప్రసాద్, చిట్టా మురళీకృష్ణ దంపతులు నిర్వహించారు. సోమవారం గరుడ వాహన, శేషవాహన ఉత్సవం నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కోట పద్మావతి ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.